ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



'నాడు-నేడు'.. పూర్తయ్యేదెన్నడు..?

● నిధులు ఖర్చు అయిపోయాయి.. పనులు మిగిలిపోయాయి..

● ఇరుకు గదుల్లో విద్యార్థుల అవస్థలు

● జగనన్న పాపం.. విద్యార్థులకు శాపం..

"దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత.. మా ప్రభుత్వంలోనే.. విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం.. నాడు-నేడు పథకం పేరుతో.. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వేల కోట్లు ఖర్చు చేశాం.. మౌలిక వసతులు కల్పించాం. ప్రైవేటు పాఠశాలలను తలదన్నే రీతిలో సౌకర్యాలు కల్పించాం.. ఇప్పటి వరకు విద్యావ్యవస్థకు మేము వేసినంత పెద్దపీట గతంలో ఏ ప్రభుత్వమూ వేయలేదు.." ఇవీ మాజీ సీఎం జగన్ పలికిన ప్రగల్భాలు. ఆయన ప్రభుత్వం పడిపోయినంత వరకే కాకుండా.. ఇప్పటికీ అడిగిన వారికి.. అడగని వారికి.. గొప్పగా చెప్పుకుంటున్న మాటలు.. అయితే అందులో వాస్తవమెంత..? అని తెలుసుకునేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను ఆంధ్రజ్యోతి ఆరా తీస్తే అంతా డొల్లే అని అర్థమైంది.



పీటీఎం మండలం బోర్లపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో పునాది దశలోనే ఆగిపోయిన తరగతి భవనం



లక్కిరెడ్డిపల్లె మండలం గొల్లపల్లెలో అసంపూర్తిగా ఉన్న ప్రాథమిక పాఠశాల

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): మైసూరుబోండాలో మైసూరు లేనట్లు.. నేతిబీరకాయలో నేయి లేనట్లు.. ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనుల్లో జగనన్న చెప్పుకున్నంత గొప్పగా ఏమీ లేవు. వందల కోట్లు ఖర్చు చేశారు కానీ.. ఇప్పటికీ ఆ పనులు పూర్తి కాలేదు. మొదటి, రెండవ విడత కింద ఎంపికైన ఏ పాఠశాలలోనూ.. పనులు పూర్తి కాలేదంటే.. జగనన్న ఒప్పుకోకపోవచ్చేమో కానీ.. ఇది వాస్తవం. సుమారు 80 శాతానికి పైగా పాఠశాలల్లో ఇంకా పెయింటింగ్ పనులు, ఎలక్ట్రీషియన్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఇంకా కొన్నిచోట్ల పాత పనులకే మెరుగులు దిద్ది.. బిల్లులు కూడా చేసుకున్నారు. వెరసీ.. నాడు-నేడు పనులు పూర్తి కాలేదు. దీంతో ఇప్పటికే ఉన్న గదుల్లో విద్యార్థులు సర్దుకొని కూర్చుంటున్నారు. నాడు-నేడు మొదటి విడతలో జిల్లాలోని 30 మండలాల్లో, 355 పంచాయతీలలో, 605 పాఠశాలలు ఎంపిక చేశారు. రెండవ విడతలో 320 పంచాయతీలలో 1039 పాఠశాలలు ఎంపిక చేశారు.

లక్కిరెడ్డిపల్లె మండలంలో..

రెండో విడత 29పాఠశాల భవనాలు మంజూరయ్యాయి. అందులో 26 పాఠశాలలు, 3 అంగన్‌వాడీ పాఠశాలలు మంజూరయ్యాయి. 3 కోట్ల 11 లక్షల రూపాయలు నిధులు మంజూరయ్యాయి. అందులో ఇప్పటికి రెండు కోట్ల 88 లక్షలు నిధులు పూర్తిగా ఖర్చు చేశారు. అయినా కనీసం ఒక భవనం కూడా పూర్తి కాలేదు. భవనాలకు తలుపులు, కిటికీలు, కింద ఫ్లోరింగ్, రంగులు వేయలేదు. మొత్తం 29 భవనాలకూ స్లాబులు, పూతలు వేసి వదిలేశారు. కాంట్రాక్టర్లను అడిగితే.. ఇసుక మెటీరియల్ సిమెంటు అన్నీ ప్రభుత్వం సరఫరా చేసిందని, చేతికి ఒక రూపాయి కూడా డబ్బు ఇవ్వలేదని వాపోతున్నారు.

సుండుపల్లె మండలంలో..

మండల వ్యాప్తంగా 22పాఠశాలలు నాడు-నేడు కింద ఎంపికయ్యాయి. ఈ పాఠశాలల్లో 70 శాతానికి పైగా పనులు జరగలేదు. పనులు పూర్తి కాక అసంపూర్తిగా ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా రూ.659 కోట్లతో నాడు-నేడు పనులు ప్రారంభించగా.. పూర్తి స్థాయిలో నిధులు కేటాయించలేదు. గత ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందని పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. వైసీపీ ప్రభుత్వం ముందుచూపు లేకుండా.. ప్రభుత్వ బడుల విలీనం చేయడంతో.. విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. గత ప్రభుత్వంలో ఆగిపోయిన పనులు ఇప్పటికీ కొన్ని చోట్ల ప్రారంభం కాలేదు. మండలంలో పలుచోట్ల గదుల కొరత విద్యార్థులను వేధిస్తోంది.

పెద్దతిప్పసముద్రంలో..

నాడు-నేడు పనుల్లో భాగంగా మొదటి విడతగా 19 పాఠశాలలు ఎంపికయ్యాయి. రెండో విడత 23 పాఠశాలలు ఎంపిక కాగా.. ఎక్కడా పనులు పూర్తి కాలేదు. మండల వ్యాప్తంగా మొత్తం 1366.70 కోట్ల నిధులు విడుదలయ్యాయి. మండల వ్యాప్తంగా ఏ పాఠశాలలోనూ.. పనులు పూర్తి కాలేదు. మండలంలోని పలు ఉన్నత పాఠశాల్లో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మండలంలోని కమ్మచెరువు జిల్లా ఉన్నత పాఠశాలలో పనులు అర్థాంతరంగా నిలిపేశారు. రంగసముద్రం జడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులు తూతూమంత్రంగా చేపట్టారు. పాత పనులకే మెరుగులు దిద్ది బిల్లులు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బోర్లపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో పాఠశాల కాంపౌండ్‌లో మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి. అదనపు గదుల పనులు మొదలు పెట్టనేలేదు. మండల కేంద్రమైన పెద్దతిప్ప సముద్రంలో అంగన్‌వాడీ భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. పూర్తి స్థాయిలో ఒకటి, రెండవ విడతల్లో పనులు ఎక్కడా పూర్తి కాలేదు.

నిమ్మనపల్లెలో...

రెండవ విడత నాడు-నేడు పనుల్లో బాగంగా 23 పాఠశాలలకు నిధులు మంజూరయ్యాయి. అయితే మొత్తం అంచనా మూడు కోట్లు కాగా.. అందులో 1.79 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో 80 శాతం వరకు పనులు పూర్తయినట్లు ఎంఈవో-2 నారాయణ తెలిపారు. ఇంకా పెయింటింగ్, ఎలక్ట్రీషియన్ పనులు చేయాల్సి ఉంది.



నిమ్మనపల్లె మండలం ఇంకోజిరావుపల్లె ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న పనులు

రైల్వేకోడూరులో...

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గత ప్రభుత్వంలో నాడు-నేడు కింద ఒకటి, రెండు విడతల్లో రూ.35 లక్షలు అదనపు గదుల కోసం మంజూరు చేశారు. ఇప్పటికి 75 శాతం పనులు పూర్తి చేశారు. ఇంకా 25 శాతం అసంపూర్తిగా ఉన్నాయి. మిగిలిన పనులు చేయడానికి ఇంకా సుమారు రూ.25 లక్షలు అవసరం అవుతాయని ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామయ్య తెలిపారు. చాలా కాలంగా నిధులు లేక అదనపు తరగతి గదులు పూర్తి కాలేదు. దీంతో ఉన్న గదులతోనే.. ఇరుక్కుని విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అదనపు గదులు నిర్మాణం జరిగి ఉంటే.. విద్యార్థులకు సౌలభ్యంగా ఉండేది. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని.. అసంపూర్తిగా ఉన్న నాడు-నేడు పనులు పూర్తి చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుకుంటున్నారు.



గోడలకు పూత దశలో నిలిచిపోయిన రైల్వేకోడూరు బాలికల ఉన్నత పాఠశాల భవనం

జిల్లాలో 20 సూత్రాలను పటిష్టంగా నిర్వహించాలి

● లక్ష్యసాధనలో వందశాతం ఫలితాలు సాధించాలి

● 20 సూత్రాల అమలు కార్యక్రమ చైర్మన్ లంకా దినకర్



సమావేశంలో మాట్లాడుతున్న 20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 20 సూత్రాల కార్యక్రమాలను అత్యంత పటిష్టంగా నిర్వహించి లక్ష్య సాధనలో వంద శాతం ఫలితాలకు కృషి చేయాలని 20 సూత్రాల అమలు కార్యక్రమ చైర్మన్ లంకా దినకర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాకు విచ్చేసిన ఆయనకు స్థానిక కలెక్టరేట్ వద్ద కలెక్టర్ చామకూరి శ్రీధర్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌లు స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో 20 సూత్రాల కార్యక్రమం అమలుపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ జిల్లా సమీక్షలో భాగంగా కేంద్ర ప్రయోజిత పథకాలు, వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాల్లో పురోగతిపై సమీక్ష నిర్వహించేందుకు విచ్చేశానని, కలెక్టరేట్‌లో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో సమీక్షించినట్లు తెలిపారు. సమీక్షకు సంబంధించి పూర్తి సమాచారం అందించడంలో, వివరించడంలో అధికారుల మధ్య సమన్వయ లోపం ఉందన్నారు. ఉపాధిహామీ, జల్‌జీవన్ మిషన్, అమృత్‌పథకం 1, 2, పీఎం ఆవాస్‌యోజన, టిడ్కో గృహాలు, పీఎం సూర్యఘర్ పథకం, పీఎం కుసుమ్ వ్యవసాయానికి విద్యుత్ అందించే పథకం, అలాగే కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న యూరియా సబ్సిడీ, జాతీయ ఆహార భద్రత పథకం, గరీబ్ కల్యాణ అన్నయోజన తదితర అంశాల్లో సమగ్రంగా సమీక్షించమని ఆయన తెలిపారు. శాఖల మధ్య సమన్వయంతో పథకాల అమలుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న పథకాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని రూపొందించాలని తెలిపారు. జిల్లాలో దాదాపు రెండు లక్షల పైబడిన వారికి పనులు కల్పించామని, అందులో 8588 కుటుంబాలు 100పనిదినాలు పూర్తి చేసుకున్నాయని తెలిపారు. మెటీరియల్ కాంపోనెంట్‌కు సంబంధించి ఏడాది రూ.132 కోట్లు అంచనా కాగా, ఇప్పటి వరకు రూ.102 కోట్లు ఖర్చు చేశారని అధికారులు లెక్కలు వేశారన్నారు. రాబోయే రెండు నెలల కాలంలో సాధ్యమైనంత ఎక్కువ పనులు కల్పించి వందశాతం లక్ష్యసాధనకు కృషి చేయాలని సూచించారు. జల్‌జీవన్ అంశంలో 3.28 లక్షల గృహాలు ఉండగా, 3.16 లక్షల గృహాలకు సురక్షిత తాగునీరు కనెక్షన్లు ఇచ్చినట్లు అధికారులు వివరించారు. పీఎం ఆవాజ్ యోజనకు సంబంధించి దాదాపు 79,720 గృహాలు మంజూరు కాగా, ఇప్పటికి 37,250 ఇల్లు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. పూర్తి చేసిన ఇళ్లలో జీవనానికి అవసరమయ్యేలా మౌలిక వసతులు విద్యుత్, నీరు, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ కల్పించి లబ్ధిదారులు నివాసం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వారన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదన్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో సారథులుగా.. మహిళలు

● అదనపు ఆదాయంతో జీవనోపాధులు

● ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు



వివరాలు.. 6లో

సమగ్ర శిక్ష ఏపీసీగా నిత్యానంద రాజులు



కడప ఎడ్యుకేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా నిత్యానందరాజులు నియమితులయ్యారు. శుక్రవారం కడప నగరం సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఈయనను బదిలీపై సమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినేటర్‌గా నియమించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను కలిశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సూపరింటెండెంట్ మురళీమోహన్ పాల్గొన్నారు.

సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

● తప్పుడు సమాచారం షేర్ చేస్తే కేసులు ● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటిటౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సామాజిక మాధ్యమాల్లో ఎవరైనా తప్పుడు సమాచారం షేర్ చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హెచ్చరించారు. శుక్రవారం ఆయన అన్నమయ్య పోలీస్ వాట్సాప్ ఛానల్‌ను ప్రారంభించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ మీ పరిధిలో చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు చేస్తున్న వారి వివరాలు స్థానిక పోలీసులకు తెలియజేయాలన్నారు. ఏదైనా అధికార సమాచారం వస్తేనే ప్రజలు నమ్మాలన్నారు. అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించి, ఇంటర్నెట్ ద్వారా వాట్సాప్, ఫేస్‌బుక్, టెలిగ్రాం, ఎక్స్, ఇన్‌స్టాగ్రాం తదితర సామాజిక మాధ్యమాలపై నిఘా పెట్టామని, ఏదైనా తప్పుడు సమాచారం వైరల్ అవుతుంటే ఆయా గ్రూప్ అడ్మిన్‌లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వాట్సాప్ ఛానల్‌ను జిల్లా ప్రజలు అందరూ ఫాలో అయి ఎప్పటికప్పుడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, పోలీసుల అధికారిక సమాచారం తెలుసుకోవచ్చన్నారు. ప్రతిఒక్కరూ ముందుగా మీ వాట్సాప్‌ను అప్డేట్ చేసిన వెంటనే అన్నమయ్య పోలీసు వాట్సాప్ ఛానల్ కనబడుతూ ఉంటుందని, ఎప్పటికప్పుడు పోలీసుల తాజా సమాచారాన్ని వీక్షించవచ్చన్నారు.

కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు

సంక్రాంతి పండుగ రోజుల్లో సాంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జూద క్రీడలు కాకుండా సాంప్రదాయ ఆటలు ఆడుకోవాలని సూచించారు. కోడిపందేలు, పేకాట, గుండాట, చెక్కాబొమ్మ ఇలా ఏ జూద వ్యసనమైనా ప్రజల జీవితాలను నాశనం చేస్తుందన్నారు. అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని తెలిపారు. కోడిపందేలు జూదరులు, కోడి కత్తుల తయారీదారులు, పేకాట శిబిరాల నిర్వాహకులపై ఇప్పటికే గట్టి నిఘా ఉంచామన్నారు. సంక్రాంతి పండుగను పురష్కరించుకొని ఎవరైనా జిల్లాలో కోడి పందేలు నిర్వహించినా పందేలు నిర్వహణకు స్థలాలు, భూములు ఇచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు యువకులు జూదాలకు బానిసలై కేసుల్లో ఇరుక్కుపోయి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటారన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే సంబంధిత పోలీస్‌స్టేషన్ వారికి లేదా డయల్ 100/112కు ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ పేర్కొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



మృతుడు సుధాకర్‌రాజు (ఫైల్ ఫోటో)

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వి.పి.ఆర్. కండ్రిగ పంచాయతీ పరిధిలోని పొట్టిరాజుగారిపల్లె గ్రామానికి చెందిన రైతు పోతురాజు సుధాకర్‌రాజు(56) గురువారం రాత్రి పురుగుల మందు తాగి మృతిచెందాడు.. రైల్వేకోడూరు ఎస్ఐ నవీన్‌బాబు వివరాల మేరకు.. మృతుడు సుధాకర్‌రాజుకు రెండు ఎకరాల పొలం ఉంది. అందులోనే వ్యవసాయం చేసి కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. అప్పులు చేసి వ్యవసాయం చేయడంతో పంటలో దిగుబడి రాక నష్టాలు రావడంతో మానసికంగా ఇబ్బందులు పడ్డాడు. అప్పులు ఇచ్చిన వ్యక్తుల నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడుకు భార్య పోతురాజు రామసుబ్బమ్మ, కుమారుడు ముఖేష్ ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పు చెల్లించలేదని వడ్డీ వ్యాపారి దాడి

6

దివ్యాంగులకు కృత్రిమ పాదాల పంపిణీ

కడప ఎడ్యుకేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చేతన ఫౌండేషన్, బార్డిలై సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో సుమారు 60 మంది దివ్యాంగులకు కృత్రిమ పాదాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్ఓ విశ్వేశ్వరనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కూడా దివ్యాంగుడనని, క్యాన్సర్‌తో కుడిచేయి కోల్పోయినా మొక్కవోని ధైర్యంతో ఉద్యోగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించానన్నారు. దివ్యాంగులు ఆత్మన్యూనతకు లోను కాకుండా అనుకున్నది సాధించాలన్నారు. వికసిత ఫౌండేషన్ చైర్‌పర్సన్ శూలం లక్ష్మీదేవి మాట్లాడుతూ గతంలో కూడా చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా స్వయం ఉపాధిలో భాగంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశామని, కబడ్డీ పోటీలు నిర్వహించామని తెలిపారు. అలాగే శ్రీగురుదేవ చారిటబుల్ ట్రస్ట్ చేయూతనందించారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్వీ కృష్ణకిషోర్, ఎన్‌వైకే అధికారి మణికంఠ, చేతన ఫౌండేషన్ సభ్యులు ముత్తినేని సురేశ్, చంద్రకాని నవీన్, షేక్ రషీద్, ట్రస్ట్ చైర్మన్ జగదీశ్‌బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్ఓ విశ్వేశ్వర నాయుడు

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి

● ఊరూవాడా వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ



నందలూరు సౌమ్యనాథస్వామి ఆలయంలో క్యూలైన్లలో ఉన్న భక్తులు

రాయచోటిటౌన్/ఒంటిమిట్ట/నందలూరు, జనవరి 10: భక్తులు వైకుంఠ ఏకాదశి వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారిని వైకుంఠ ద్వారదర్శనం చేసుకొని పునీతులయ్యారు. నిర్వాహకులు వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అలంకారాలు, పట్టువస్త్రాలు సమర్పించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ముఖ్యంగా ఆంధ్ర అయోధ్యగా పేరుగాంచిన కోదండ రామాలయంలో, నందలూరు సౌమ్యనాథస్వామి ఆలయంలో భక్తులు తెల్లవారుజాము నుంచే క్యూ లైన్లలో కిటకిటలాడారు. జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని మాసాపేటలో గల లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఒంటిమిట్టలో...

ఏకశిలా నగరి కోదండరామాలయంలో ముక్కోటి వేడుకలను వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం 4.30 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు ఉత్తర ద్వారంలో ఐదు గంటలకు గరుడ వాహనంపై ఉత్సవ మూర్తులైన సీతారామ లక్ష్మణులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం బాలలయ ఉత్సవ మూర్తులైన సీతారామ లక్ష్మణులను దర్శించుకుని స్వామివారి కృపా కటాక్షాలను పొందారు.

భక్తులకు బాదంపాలు, అన్నదానం వితరణ

వేకువజామున రామాలయానికి వచ్చే భక్తులకు బాదంపాలు పంపిణీ చేపట్టారు. ఉదయం నుంచి స్థానిక ఆవరణంలో అన్నదాన కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. వీటితో పాటు స్థానిక వీరాంజనేయస్వామి గుడి వద్ద పెద్దఎత్తున అన్నదానంతో పాటు చెక్కభజన కార్యక్రమాన్ని నిర్వహించారు

గరుడవాహనంపై రామయ్య

వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్థానిక కోదండరామాలయంలో ఉత్తర ద్వారంలో గరుడ వాహనంపై ఉన్న స్వామివారు ఉదయం 9 గంటలకు ఉత్తర ద్వారం గుండా, పురవీధుల గుండా భక్తులకు దర్శనమిచ్చారు. గరుడ వాహనంపై సీతారామ లక్ష్మణులకు గ్రామంలో భక్తులు పెద్దఎత్తున కాయకర్పూరం సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామోత్సవం వెంట టీటీడీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఇన్‌స్పెక్టర్ నవీన్, టీటీడీ సిబ్బంది నాయక్, ప్రవీణ్, వినోద్, అర్చకులు వీర రాఘవాచార్యులు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తర ద్వారంలో గరుడ వాహనంపై దర్శనమిస్తున్న సీతారామ లక్ష్మణులు



ఒంటిమిట్టలో క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



ఒంటిమిట్ట... గ్రామోత్సవంలో దర్శనమిస్తున్న స్వామివారు



స్వామివారి వెంట కోలాటం చేస్తున్న మహిళలు

టీడీపీ హయాంలోనే ప్రాధాన్యత

● రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదాశివం



పీలేరులో జరిగిన అభినందన సభలో మాట్లాడుతున్న సదాశివం

పీలేరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ హయాంలోనే రాష్ట్రంలోని నాయీబ్రాహ్మణులకు రాజకీయ, సామాజిక, ఆర్థిక ప్రాధాన్యత దక్కిందని ఆ సంఘం కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం పేర్కొన్నారు. పీలేరు నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయిబ్రాహ్మణుల పేద పరిస్థితులను చూసిన దివంగత సీఎం ఎన్టీఆర్ 1989లో ఫెడరేషన్ ఏర్పాటు చేశారని, తదనంతర కాలంలో సీఎం చంద్రబాబు దాన్ని కార్పొరేషన్‌గా మార్చారన్నారు. ఈ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలోని లక్షలాది మంది నాయీబ్రాహ్మణులు అటు వృత్తి, ఇటు వ్యక్తిగత జీవితాల్లో ఎంతో అభివృద్ధి చెందారన్నారు. టీటీడీ పాలకమండలి లోనూ ఇద్దరు నాయీబ్రాహ్మణులకు స్థానం కల్పించిన ఘనత చంద్ర బాబుకే దక్కిందన్నారు. గత ఐదేళ్ల కాలంలో జగన్ సర్కారును బీసీలను పూర్తిగా విస్మరించిందని, పేరుకు 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా నిధులు, విధులు లేకపోవడంతో అవి అలంకారప్రాయంగా మిగిలిపోయా రన్నారు. అనంతరం ఆయనను స్థానిక నాయకులు ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.మల్లిఖార్జున, మాజీ ఎంపీపీ మహితా ఆనంద్, పీలేరు సంఘం అధ్యక్షుడు ఎర్రయ్య, సభ్యులు రాజగోపాల్, ఆంజనేయులు, రమేశ్, గిరి, వాణి, వెంకటరమణ, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ



అవగాహన కల్పిస్తూ మానవహారంగా ఏర్పాటు చేసిన దృశ్యం

సంబేపల్లె, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు సిబ్బందికి జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ ఆదేశాల మేరకు ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ నిర్వహించినట్లు డివిజినల్ మోడల్ మేకింగ్ ట్రైనర్ సుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం రౌతుకుంట రైతు పీరుసాబ్ పొలంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం భవిష్యత్ తరాలకు ఒక దివ్య ఔషధమని, యువత వారికున్న సమయంలో వ్యవసాయానికి కూడా కొంత భాగం కేటాయిస్తూ వ్యవసాయ రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం రైతులకు పెట్టుబడులు తగ్గిస్తూ మంచి ఆహార ఉత్పత్తులు మానవాళికి అందించేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు, ప్రజలు, మహిళా సంఘ సభ్యులు, జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ మండల సిబ్బంది, ఐబీఐసీఆర్పీలు, ఐసీఆర్పీలు, యూనిట్ ఇన్‌చార్జిలు, మాస్టర్ ట్రైనర్ మానస, ఎన్ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలను
వినియోగంలోకి తేవాలి

● జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి

నందలూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలని జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి కార్యదర్శులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులతో శుక్రవారం రివ్యూ మీటింగ్ నిర్వహించిన ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులు వసూలు, సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం నందలూరు, పాటూరు పంచాయతీల్లోని సంపద తయారీ కేంద్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు టీడీపీ నాయకులు మోడపోతుల రాము తదితరులు పాల్గొన్నారు.



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ బాలకృష్ణారెడ్డి

ఆటో సారథులుగా..
మహిళలు



● అదనపు ఆదాయంతో జీవనోపాధులు

● ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు

కడప ఎన్టీఆర్‌సర్కిల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అవని నుంచి ఆకాశం వరకు అన్నింటా తాము ఉంటామంటూ పోటీపడుతున్న అతివలు వచ్చిన అవకాశాలు అందిపుచ్చుకుంటూ మెరుగైన జీవనోపాధుల వైపు దూసుకెళ్తున్నారు. ఆటో సారథులుగా సైతం మహిళలు రాణిస్తున్నారు. ప్రభుత్వాలు వారిని ప్రోత్సహిస్తూ చేయూతనిస్తున్నాయి. స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులకు మెరుగైన జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. ఇందులో భాగంగా ఉత్సాహమున్న మహిళలకు తాము ఎంచుకున్న వ్యాపారంలో రాణించేందుకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇందులో భాగంగా వైఎస్సార్ కడప జిల్లాలో 12 మందికి ఆటోలు ఇప్పించారు. వీటిని స్వయంగా మహిళా సభ్యులు నడుపుతూ కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. సెర్ప్ ఉన్నతి మహిళా శక్తి ద్వారా ఆటోలు అందజేశారు. 8 మంది ఎస్సీలు, నలుగురు ఎస్టీ మహిళలు లబ్ధిపొందారు. ఇందుకోసం రూ.35,28,770 ఖర్చుచేశారు. ఇందులో రూ.31,41,228 రుణం అందించగా రూ.3,85,949 లబ్ధిదారుల వాటాగా వసూలు చేశారు. లబ్ధిదారులు ఆటోకోసం పొందిన రుణం పూర్తిగా వడ్డీ లేకుండా 48 కంతుల్లో తిరిగి చెల్లించే విధంగా ప్రణాళిక రూపొందించారు. లబ్ధిపొందిన వారిలో ప్రొద్దుటూరు మండలం లింగాపురంలో ఇద్దరు, ఒంటిమిట్ట మండలం యానాది గ్రామ సమాఖ్యలో ఇద్దరు గిరిజన మహిళలు ఉండగా.. ప్రొద్దుటూరు, వల్లూరు, పులివెందుల, సిద్దవటం, పెండ్లిమర్రి మండలాలకు చెందిన ఎనిమిది మంది దళిత మహిళలు ఉన్నారు.



ఆటోల పంపిణీని ప్రారంభించిన కలెక్టర్ విజయరామరాజు (ఫైల్)

అదనపు ఆదాయంతో జీవనం

లబ్ధిదారులు తాము స్వయంగా ఆటోలు నడుపుతూ కుటుంబానికి అదనపు ఆదాయం సమకూరుస్తుండటంతో మెరుగైన జీవితం సాగిస్తున్నారు. పెండ్లిమర్రి మండలానికి చెందిన ఒక లబ్ధిదారు యోగివేమన యూనివర్సిటీకి అవసరమైన కూరగాయలు తీసుకురావడంతో పాటు స్థానికంగా ప్యాసింజర్లను చేరవేస్తున్నారు. వీరిలో చాలా మంది లబ్ధిదారులు పొలం పనులకు కూలీలను తీసుకెళ్లడం, అక్కడే వారితో పాటు వ్యవసాయ పనులు చేయడంతో ఒకవైపు ఆటో బాడుగ మరోవైపు కూలీ డబ్బులు సంపాదించే అవకాశం రావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో మహిళ తాను స్కూల్ పిల్లలను తీసుకొని వెళ్లడం, మధ్యాహ్నం భోజనం క్యారియర్లు తీసుకొని వెళ్లడం వల్ల పనిదొరికిందని.. దీంతో కుటుంబానికి ఎంతో ఆసరా దొరికిందని అంటున్నారు.

ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు

స్వయం సహాయక సంఘాలు అభివృద్ధి సాధిస్తుండడంతో ఆ సంఘాల్లోని సభ్యులను ప్రభుత్వాలు మరింత ప్రోత్సహిస్తున్నాయి. సభ్యుల అభిరుచులకు అనుగుణంగా వివిధ రంగాలలో వ్యాపారం చేసుకుని మరింత ఆర్థిక అభివృద్ధిని సాధించేందుకు పేదరిక నిర్మూలన సంస్థ చర్యలు తీసుకుంటోంది. దీంతో స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు చిరు వ్యాపారం నుంచి పరిశ్రమలు ఏర్పాటుచేసే స్థాయికి ఎదుగుతున్నారు. 50కి పైగా సంఘాలకు రూ.100 కోట్లకు పైగా ఆర్థికసాయం అందించేందుకు సెర్ప్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ సంఘాల్లోని ఒక్కొక్క సభ్యురాలికి వారు ఏర్పాటుచేసే పరిశ్రమను బట్టి రూ.10లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఆర్థికసాయం అందిస్తున్నారు. మహిళా సంఘాల సభ్యులు కూడా తాము పొందిన రుణాలు సకాలంలో తిరిగి చెల్లించి నమ్మకాన్ని ఏర్పరచుకోవడంతో కోరినంత రుణం ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకొస్తున్నారు.

పేదరిక నిర్మూలన కోసం చర్యలు

- ఆనంద్‌నాయక్, పీడీ, డీఆర్‌డీఏ



స్వయం సహాయక సంఘాల్లోని మహిళల పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సంఘంలోని ప్రతి మహిళకు ఏదో ఒక పథకం ద్వారా ఆర్థిక లబ్ధిచేకూర్చి వారికి మరింత మెరుగైన జీవనోపాధులు కల్పించడం కోసం చర్యలు తీసుకుంటున్నాం. సెర్ప్ ఆదేశాలకు అనుగుణంగా, మహిళా సంఘాల్లోని సభ్యుల ఆసక్తిని బట్టి వారి జీవనోపాధికి అవసరమైన ఆర్థిక వనరులు సమకూర్చుతున్నాం.

బడి పిల్లలను తీసుకెళ్లడం వల్ల ఉపాధి

- లత, ఉన్నతి లబ్ధిదారు, ప్రొద్దుటూరు



నేను స్వయం సహాయక సంఘంలో చేరిన తర్వాత పొదుపు చేసుకోవడంతో పాటు చిన్నచిన్న మొత్తాల్లో రుణం పొంది సకాలంలో తిరిగి చెల్లించేదాన్ని. 10వ తరగతి వరకు చదువుకున్న నేను ఆటో డ్రైవింగ్‌లో కూడా ప్రావీణ్యం పొందాను. డీఆర్‌డీఏ, వెలుగు వారు రుణం కింద ఆటో ఇప్పించారు. దాని ద్వారా సంపాదించుకుంటూ మెరుగైన జీవనం సాగిస్తున్నా. ఇళ్ల వద్ద నుంచి బడి పిల్లలను పాఠశాలకు తీసుకువెళ్లి తిరిగి తీసుకురావడం ద్వారా ఉపాధి లభించింది. ఖాళీ సమయంలో బాడుగలకు వెళ్లడం, ప్యాసింజర్లను తీసుకెళ్లడంతో అదనపు ఆదాయం వస్తుంది. నెలకు దాదాపు రూ.20వేల నుంచి రూ.25వేలు సంపాదించుకుంటున్నా. ఆటోకు నెలవారీ కంతుపోను మగిలిన సొమ్ముతో కుటుంబపోషణ చేసుకుంటున్నా.

పేదరికం నుంచి బయటపడుతున్నా

- వెంకటసుబ్బమ్మ, లబ్ధిదారు, నందనగర్, ఎస్టీ కాలనీ, ఒంటిమిట్ట



నేను కూలి పని చేసుకుంటూ, అడవిలో గడ్డలు ఏరుకుంటూ అతిపేదరికంలో జీవనం సాగించేదాన్ని. తర్వాత పొదుపు సఘంలో చేరాను. ఆ సంఘం ద్వారా నెలనెల పొదుపు చేసుకుని బ్యాంకులో లోన్ పొంది సక్రమంగా చెల్లించాను. దీంతో తిరిగి బ్యాంకులోన్ తీసుకుని మేకలు పట్టుకుని జీవిస్తూ ఉండేవాళ్లం. తర్వాత వెలుగు అధికారులు ఆటో లోన్లు వచ్చాయని చెప్పారు. నేను టెన్త్ వరకు చదువుకున్నాను. మా గూడెంలో వేరే వాళ్ల వద్ద ఆటో నేర్చుకుని లోనుకు అప్లయ్ చేసుకున్నాను. రూ.2,70,000 ఉన్నతి లోన్ మంజూరైంది. ప్రతినెల రూ.6వేలు కంతు చెల్లిస్తున్నాను. ఆటో నడపడం వల్ల జీవనోపాధి మెరుగుపడింది. నా పిల్లల చదువు అన్నీ సక్రమంగా జరుగుతున్నాయి.

బంకుల విషయమై గుర్రంకొండలో ఉద్రిక్తత...!

● ప్రభుత్వ స్థలం ఆక్రమణ



బంకుల విషయమై ఘర్షణ పడుతున్న యువకులు

గుర్రంకొండ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉన్న బీఎల్‌డబ్ల్యూ క్వార్టర్స్ స్థలంలో అక్రమంగా రేకు బంకులను ఏర్పాటు చేస్తుండడంతో శుక్రవారం రాత్రి ఉద్రిక్తత చోటు చేసుకుంది. వందలాది మంది యువకులు ఓ చోట గుమికూడి బంకుల ఏర్పాటును అడ్డుకోవడంతో కొంత సేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. ఘటన స్థలానికి పోలీసులు చేరుకోవడంతో సర్దుమనిగింది. పట్టణ నడిబొడ్డున బీఎల్‌డబ్ల్యూ క్వార్టర్స్ ఉంది. ఇవి శిథిలావస్థకు చేరుకుంది. ఈ స్థలాన్ని గత ప్రభుత్వ హయాంలో కొంతమంది వైసీపీ నాయకులు అక్రమించుకొని కబ్జాకు యత్నించారు. అప్పట్లో జిల్లా అధికారులకు ఆక్రమణలపై ఫిర్యాదులు వెల్లడంతో అలానే వదిలేశారు. ఈ క్రమంలో కొంత స్థలంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయగా మిగిలిన స్థలం ఖాళీగానే ఉంది. ప్రస్తుతం ఈ స్థలం 2 కోట్లకు పైగా విలువ చేస్తుంది. ఈ నేపథ్యంలో ఖాళీ స్థలంలో కొందరు నాయకులు రేకుల బంకులను ఏర్పాటు చేయడానికి సిద్ధమయ్యారు. ఈ రేకులషెడ్డులను ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయరాదంటూ అదే వర్గంలోని వందలాది మంది యువకులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని అల్లరిమూకలను తరిమేశారు. అధికారుల అనుమతులు లేకుండా ఎటువంటి బంకులను ఏర్పాటు చేయకూడదని పోలీసులు సూచించారు.

అప్పు చెల్లించలేదని వడ్డీ వ్యాపారి దాడి



తీవ్రంగా గాయపడిన మోహన్ రావు

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 10(ఆంధ్రజ్యోతి): అప్పు చెల్లించ లేదని పట్టాణానికి చెందిన మారెళ్ల మోహన్ రావుపై వడ్డీ వ్యాపారి సుగవాసిబాబు శుక్రవారం దాడి చేశాడు. బాధితుడి వివరాల మేరకు.. తాను వడ్డీ వ్యాపారి సుగవాసిబాబు వద్ద కొంత నగదును తీసుకు న్నానని, వ్యాపారపరంగా నష్టపోయి ఇబ్బందుల్లో ఉన్న సమయంలో డబ్బులు చెల్లించాలని వేధించే వాడన్నారు. డబ్బులు ఇచ్చేందుకు కొంత సమయం కావాలని వేడుకున్నా వినకుండా రెడ్డివారిపల్లి సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలోకి పిలిపించి డబ్బుల విషయంగా చర్చిస్తుండగా తనపై మద్యం బాటిల్‌తో దాడి చేశాడని ఆరోపించారు. ఈ మేరకు బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గాయపడిన బాధితుని పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్‌బాబు తెలిపారు.

ఆక్రమణదారుల నుంచి
మా భూమి ఇప్పించండి మహాప్రభో



రైతు పత్తి సుబ్బరాయుడు

ఓబులవారిపల్లె, జనవరి 10: మండల పరిధిలోని చెన్నరాజుపోడు గ్రామ రెవెన్యూ పరిధిలో తమ భూమిని ఆక్రమించి దౌర్జన్యాలు చేస్తున్నారని, తనకు న్యాయం చేయాలని బాధితుడు పత్తి సుబ్బరాయుడు వాపోతున్నాడు. శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. మండల పరిధిలోని చెన్నరాజుపోడు రెవెన్యూ పరిధిలో తనకున్న భూములకు సంబంధించి ఒక ఎకరా 75 సెంట్లు భూమి ఆక్రమణకు గురైందని, తమ భూమిని తమకు ఇప్పించండి మహాప్రభో అంటూ అధికారులను వేడుకుంటున్నా పట్టించుకోలేదని రైతు సుబ్బరాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. తనకున్న భూమిలో 10 ఎకరాల 80 సెంట్లు గతంలో విక్రయించానని, సదరు భూమి కొన్న వ్యక్తి తాము లేని సమయంలో 12 ఎకరాల 55 సెంట్లు భూమిని అక్రమంగా దౌర్జన్యంగా ఆక్రమించారని కన్నీటిపర్యంతమయ్యారు. అప్పటి నుంచి అనేకసార్లు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగి అర్జీలు ఇచ్చినా, భూమి కొలతలకు చలానాలు కట్టినా ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించాడు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సులో కూడా ఫిర్యాదు చేసినప్పటికి స్థానిక అధికారులు పట్టించుకోలేదని లబోదిబోమంటున్నాడు. గతంలో పొలం దగ్గరకు వెళితే తనపై దౌర్జన్యాలు, హత్యాయత్నం కూడా చేశారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధించిన అధికారులు స్పందించి మండల రెవెన్యూ సర్వేయర్‌తో కొలతలు వేయించి తమ భూమిని తమకు ఇప్పించాలని వేడుకుంటున్నాడు.

21న ఏకసభ్య కమిషన్ పర్యటన

పీలేరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో ఈ నెల 21న జరగనున్న రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ పర్యటనను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు తమ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కమిషన్ పర్యటన నేపథ్యంలో శుక్రవారం పీలేరులో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, వాటి అనుబంధ సంఘాల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుద్దు రామకృష్ణ మాదిగ, రాష్ట్ర కార్యదర్శి దుమ్ము చిన్నమాదిగ, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు రవీంద్ర మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితంగా షెడ్యూల్ కులాలలోని 59 ఉపకులాలకు వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ లభించే అవకాశం దక్కిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ (ఏకసభ్య కమిషన్) ఈ నెల 21న చిత్తూరుకు రానుందన్నారు. ఆ రోజున పీలేరు నియోజకవర్గంలోని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాస్వామికవాదులు, మాదిగ ఉపకులాల ప్రజలు పెద్దఎత్తున చిత్తూరుకు తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండికోట వెంకటేశ్, నాయకులు అమరాల వెంకటరమణ, చరణ్ కుమార్, రామ్మోహన్‌రెడ్డి, విశ్వనాథ, నాగేశ్వరరావు, మహేశ్, రమణ, శ్రీరాములు, నాగరాజ, రెడ్డమ్మ, మాధవి, సుగుణ, నాగరాజమ్మ, తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తున్న ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ శ్రేణులు






ఆహో.. ఏమి రుచి..!







ఆకలి రుచి ఎరుగదని పెద్దలు అంటుంటారు. అది మనిషి అయినా.. పక్షి అయినా.. జంతువైనా.. ఆకలి అందరికీ ఒక్కటే. ఈ కోవలోనే ఓ రామచిలుక ఆకలి బాధ తాళలేక ఓ చెట్టుకు ఉన్న మొగ్గను తన నోటితో కొరుకుతూ కనిపించింది. సాధారణంగా రామచిలుక జామపండ్లు, మామిడిపండ్లు, తదితర పండ్లను తింటూ ఉంటుంది. కానీ ఆహారం కోసం ఎక్కడెక్కడ తిరిగిందో కానీ ఏదీ దొరక్క చివరకు అవిసె కొమ్మకు ఉన్న మొగ్గను ఆస్వాదిస్తూ 'ఆహా.. ఏమి రుచి.. తినరా మైమరిచి' అని లొట్టలేసుకుంటూ తినింది. చింతకొమ్మదిన్నె మండలం, బాలుపల్లె వద్ద ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప

లింకులు క్లిక్ చేస్తే... ఖాతా ఖాళీ

- కొత్త కొత్త తరహాలో సైబర్ మోసాలు
- జిల్లా వ్యాప్తంగా వెయ్యికి పైగా ఫిర్యాదులు
- రూ.22 కోట్లకు పైగా దోచుకున్న కేటుగాళ్లు



కడప(క్రైం), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల రోజు రోజుకు మితిమీరి పోతున్నారు. ప్రజలు ఎంత జాగ్రత్తగా వున్నా కొత్త కొత్త తరహాలో సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం అందరి చేతుల్లో ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. దీంతో ప్రతి కొనుగోలు, అమ్మకాల్లో చెల్లింపు డిజిటల్ విధానంలో చేపడుతున్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, తదితర యాప్‌ల ద్వారా చెల్లిస్తున్నారు. అవన్నీ ప్రైవేట్ సంస్థలే అందువలనే మన సమాచారం అంతా వారి చేతిలో ఉన్నట్లే. ఇదే అదునుగా భావించి సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి వాటికి లింకులను పంపిస్తున్నారు. ఆ లింకులను క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. కొందరు అత్యాశ కారణంగా ఈజీ మనీ కోసం కొన్ని యాప్‌లను క్లిక్ చేస్తూ మోసపోతున్నారు.

ప్రొద్దుటూరుకు చెందిన వ్యక్తి ఫోన్‌కు లింకును పంపించారు. లింకును క్లిక్ చేయడంతో లక్షల్లో డబ్బు పోగొట్టుకున్నాడు. కడపకు చెందిన యువకుడు కూడా ఫోన్‌లో లింకును క్లిక్ చేయడంతో బ్యాంకులో ఉన్న డబ్బు కాజేశారు సైబర్ నేరగాళ్ల ఇలా జిల్లా వ్యాప్తంగా ఎందరో బాధితులుగా ఉన్నారు. మోసపోయిన వారిలో ఎక్కువగా విద్యావంతులు, ఉద్యోగులు ఉండడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా 13 నెలల్లో వెయ్యికి పైగానే ఫిర్యాదులు ఉన్నాయంటే సైబర్ నేరగాళ్ల చేతిలో ఎంతగా మోసపోతున్నారో ఇట్టే అర్థమవుతుంది. దాదాపు రూ.22కోట్లకు పైగానే డబ్బు పోగొట్టుకున్నారు.

ఆశపరులే టార్గెట్

కొందరికి డబ్బులు వస్తాయంటూ అందుకు సంబంధించి వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ లాంటివాటికి లింకులను పంపిస్తున్నారు. ఆ లింకులను క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతా ఖాళీ చేస్తున్నారు. ఆశపరులనే టార్గెట్ చేసుకుని లింకులను పంపిస్తారు. కొన్ని గేమ్స్‌కు, వర్క్ ఫ్రమ్ హోం, ఉద్యోగాలు లాంటి వాటికి సంబంధించి లింకులను పంపిస్తారు.. ఆ లింకులను క్లిక్ చేయగానే.. సైబర్ నేరగాళ్ల క్షణాల్లో బ్యాంకులోని డబ్బులను కాజేస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



సెల్ ఫోన్లకు వచ్చే లింకులకు స్పందించకూడదు. లింకులను క్లిక్ చేస్తే డబ్బును సైబర్ నేరగాళ్ల కొట్టేస్తారు. సోషియల్ మీడియాలో పోస్టులు, లింకులు పట్ల జాగ్రత్తగా ఉండాలి. సైబర్ నేరగాళ్ల కొత్త కొత్త తరహాలో మోసాలకు పాల్పడుతుంటారు. కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

-మధుమల్లేశ్వర్ రెడ్డి, సైబర్ సెల్ సీఐ

పశువైద్యసేవలను మెరుగుపరచాలి

- జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శారదమ్మ



ఏపీఎన్జీవీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

కడప రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పశువైద్యసేవలను మరింతగా మెరుగుపరిచి ప్రభుత్వ లక్ష్యసాధనకు పాటుపడాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ సి.శారదమ్మ తెలిపారు. జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయ సమావేశహాలులో శుక్రవారం ఏపీఎన్జీవీఎఫ్ 2025 సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శారదమ్మ మాట్లాడుతూ ఏపీఎన్జీవీఎఫ్ జిల్లా ఛైర్మన్ నంద్యాల రాజశేఖర్ ఆధ్వర్యంలో తీసుకొచ్చిన క్యాలెండర్, డైరీ ఉద్యోగుల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తోందన్నారు. ఆదే స్ఫూర్తితో అన్ని క్యాడర్ల ఉద్యోగులందరు కలిసికట్టుగా బాధ్యతగా పనిచేసి పశుపోషణదారులకు అందుబాటులో ఉంటూ శాఖ ఉన్నతికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎన్జీవిఎఫ్ జిల్లా ఛైర్మన్ నంద్యాల రాజశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చాంద్ బాషా, నాయకులు సదాశివయ్య, బాబునాయక్, కిరణ్‌కుమార్‌రెడ్డి, శివ లక్షుమ్మ, వరదయ్య, పెంచలరాజు తదితరులు ఉన్నారు.

ఏడుగురికి టీడీపీ శాశ్వత సభ్యత్వం

- ఒక్కొక్కరు రూ.లక్షతో నమోదు



రితీష్‌రెడ్డి సమక్షంలో టీడీపీ శాశ్వత సభ్యత్వ నమోదు చేసుకున్న అట్లూరు మండల నాయకులు

అట్లూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీపై ఉన్న నమ్మకం, అభిమానంతో మండలంలోని ఏడుగురు టీడీపీ నాయకులు ఒక్కొక్కరు లక్ష రూపాయలు చెల్లించి శాశ్వత సభ్యత్వం నమోదు చేసుకున్నారు. శుక్రవారం బద్వేలులో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రితీష్‌రెడ్డి సమక్షంలో టీడీపీ సీనియర్ నాయకులు బోవిళ్ల నంద గోపాల్‌రెడ్డి, మంచూరి సూర్యనారాయణరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లిఖార్జునరెడ్డి, ఆరవ శ్రీనివాసులరెడ్డి, పోతిరెడ్డి రెడ్డయ్య, పాలకొండు రామచంద్రారెడ్డి, పాలకొండు రాజశేఖర్‌రెడ్డి టీడీపీ శాశ్వత సభ్య త్వం తీసుకున్నారు. ఈసందర్భంగా రితీష్‌రెడ్డి వారిని అభినందించారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతున్న వారికి పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. నియోజకవర్గంలోనే అట్లూరు మండలం సభ్యత్వ నమోదులో ముందంజలో ఉందన్నారు. టీడీపీ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని కోరారు.

బండలాగుడు పోటీల్లో విజేతగా నిలిచిన చౌటిపల్లి ఎద్దులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న గ్రామస్థులు

పులివెందుల టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మండల పరిధిలోని ఉలిమెళ్ల గ్రామంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన బండలాగుడు పోటీల్లో చౌటిపల్లెకు చెందిన చంద్ర ఎద్దులు ప్రథమ బహుమతిని సాధించాయి. గ్రామ సమీపంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో గ్రామస్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో చౌటిపల్లి గ్రామానికి చెందిన చంద్ర ప్రథమస్థానంలో నిలవగా మొదటి బహుమతిని కింద రూ. 50వేలు అందించారు. రెండో బహుమతి రూ.40వేలు, మూడో బహుమతి రూ.30వేలు, నాలుగో బహుమతి రూ.20వేలు, ఐదో బహుమతి 10వేలు నగదును గ్రామస్తులు విజేతలకు అందించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి 'సీమ' సంగీత నృత్యోత్సవాలు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ గీతాశ్రమంలో శనివారం నుంచి సోమవారం వరకు మూడు రోజులపాటు రాయలసీమ సంగీత నృత్యోత్సవాలను నిర్వహిస్తున్నట్లు నటరాజ కళాక్షేత్రం నాట్య గురువు మొహిద్దీన్‌ఖాన్ తెలిపారు. కళలను, కళాకారులను ప్రోత్సహించడానికి ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో రాయలసీమ, బళ్లారితోపాటు కర్నాటక ప్రాంతానికి చెందిన 250మందికి పైగా కళాకారులు పాల్గొని కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలను ప్రదర్శిస్తారన్నారు. ఈ సందర్భంగా పలువురికి రాయలసీమ సంగీత రత్న, నృత్య రత్న అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, కేంద్ర సాంస్కృతిక శాఖ సభ్యుడు వేదాంతం రామలింగ శాస్త్రి, ఎస్వీ సంగీత నృత్య కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ జమునారాణి, వెంకటసుబ్రమణ్యం తదితరులు పాల్గొంటారన్నారు.

శేషవాహనంపై బ్రహ్మంగారి దర్శనం



ఆలయ పురవీధుల్లో శేషవాహనంపై ఊరేగుతున్న వీరబ్రహ్మేంద్రస్వామివారు

బ్రహ్మంగారిమఠం, జనవరి 10 (ఆంధ్ర జ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మం గారిమఠం దేవస్థా నంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి పండుగ సందర్భంగా వీరబ్రహ్మేంద్రస్వామి శేష వాహనంపై దక్షిణ ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు వేకువ జాము నుండే ఆలయం సింహ ద్వారం వద్ద వేచి ఉండి.. ద్వారాలు తెరవగానే భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఏకాదశి మహోత్సవాలకు ఆలయ ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను చేపట్టారు. అనంతరం గ్రామ పురవీధుల గుండా స్వామివారి గ్రామోత్సవం చేపట్టారు.

జాతీయ కాన్ఫరెన్స్‌లో వైవీయూ వీసీ



సదస్సులో వైవీయూ వీసీ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జరగనున్న ఆలిండియా యూనివర్సిటీస్ సౌత్‌జోన్ వైస్ చాన్సలర్స్ కాన్ఫరెన్స్ 2024-25లో యోగివేమన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి భాగస్వామ్యులయ్యారు. ఉన్నత విద్య భవిష్యత్తును రూపొందించడంలో భారతదేశం పాత్ర గురించి చర్చించడానికి దక్షిణభారత విశ్వవిదాయలయాల వీసీల భేటీలో వీసీ ఉన్నత విద్యాభివృద్ధిలో తన ఆలోచనలను పంచుకోనున్నారు. వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్ అండ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.రూబన్‌కుమార్ (హయ్యర్ అకడమిక్ గ్రేడ్) ఆధ్వర్యంలో 10,11 తేదీలలో జరిగే ఈ సమావేశాల్లో భారతదేశం అభివృద్ధి చెందుతున్న భారతావనిలో డిజిటల్ అవస్థాపనను విస్తరణ, ఆవిష్కరణలకు ప్రాధాన్యతపై చర్చిస్తారు. భవిష్యత్తులో ఉన్నత విద్య పరివర్తనాత్మక పాత్రను పోషించేలా ఆలోచనలు, అకడమిక్ ఎక్సలెన్స్‌ను పెంపొందించడానికి కృషి జరుగుతుందని తెలిపారు. ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి ఒక డైనమిక్ వాతావరణాన్ని ఈ సమావేశాలు అందిస్తాయని చెప్పారు. కొత్త సాంకేతికతతో నడిచే ప్లాట్‌ఫామ్‌లు, అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యం, ఇంటర్ డిసిప్లినరీ లెర్నింగ్‌పై దృష్టిసారించడం ద్వారా ప్రపంచ విద్యాధోరణులను రూపొందించడంలో కీలక పాత్ర పోషించే రెండు రోజుల పాటు చర్చలు సాగుతాయని.. అందులో వైవీయూ వీసీ ఆలోచనలను పంచుకోనున్నారు.

వేలం ద్వారా ఆదాయం రూ.19,47,000



గంగమ్మతల్లి ఆలయంలో వేలం నిర్వహిస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గంగమ్మ తల్లికి వేలం ద్వారా వచ్చిన ఆదాయం రూ.19,47,000 అని ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం గంగమ్మ దేవాలయంలో తలనీలాలు, కొబ్బరికాయలు, విడిదినాల హక్కుల కోసం వేలం నిర్వహించారు. కాగా జాతరలో తలనీలాలు (వెంట్రుకలు సేకరణ) మిగిలిన విడిదినాలకు (ప్రతిఆదివారం) సంబంధించి కొబ్బరికాయలు, పూజా సామగ్రి, షామియానా, టోల్‌గేట్ వేలం వాయిదా పడింది. ఫిబ్రవరి 28,29 తేదీల్లో జరిగే గంగమ్మ జాతరకు సంబంధించి తలనీలాలు, (వెంట్రుకలు సేకరణ), కొబ్బరికాయలు, టోల్‌గేట్, విడిదినాలు (ప్రతి ఆదివారం) హక్కులకు దేవదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఈవేలంలో టోల్‌గేట్‌కు రూ.5,70,000, కొబ్బరికాయలు రూ.6,30,000, విడిదినాలకు సంబంధించి తలనీలాలు (వెంట్రుకలు సేకరణ) రూ.5,52000 వేలం దక్కించుకున్నారు. జాతరలో తలనీలాలు (వెంట్రుకలు సేకరణ) మిగిలిన విడిదినాలకు (ప్రతి ఆదివారం) సంబంధించి కొబ్బరికాయలు, పూజా సామగ్రి, షామియానా, టోల్‌గేట్ వేలం వాయిదా పడింది. ఈ వేలం 17న నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణ అధికారి తెలిపారు. కార్యక్రమంలో సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రవీంద్రబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో ముగ్గుల పోటీలు

కడప కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురష్కరించుకుని ఈనెల 11వ తేదీ శనివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నగర రిమ్స్ సమీప శిల్పారామంలో చుక్కల ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. ఇందులో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా 5వేలు, 3వేలు, 2 వేల రూపాయల నగదు బహుమతులను అందజేస్తామన్నారు. మరో 20 మందికి కన్సోలేషన్ బహుమతులను కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరై ముగ్గుల పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

బొలేరో వాహనం ఢీ.. వ్యక్తి మృతి

దువ్వూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన ధనరాజ్ (44) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం సాయంత్రం సంఘటన జరుగగా రాత్రి ఆలస్యంగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మైదుకూరు నుంచి స్కూటీపై వెళుతుండగా బొలెరోపికప్ వాహనం అతి వేగంగా వచ్చి వెనుకవైపు ఢీకొట్టినట్లు చెప్పారు. సంఘటనలో తీవ్రంగా గాయపడిన ధనరాజ్ ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో మృతిచెందినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ట్రాక్టరు ఢీకొని గొర్రెలు మృతి

కమలాపురం రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని జడ్పీ బాలుర హైస్కూలు సమీపంలో ట్రాక్టరు గొర్రెల మందపై దూసుకెళ్లడంతో ఆరు గొర్రెలు మృతి చెందాయి. శుక్రవారం రాత్రి గొర్రెల కాపర్లు రామయ్య, అయ్యప్ప మద్దిలేటిలు కమలాపురం నుంచి కుప్పూరువారిపల్లెకు గొర్రెలు తోలుకుని వస్తుండగా వెనుక వైపు నుంచి ట్రాక్టర్ వేగంగా వచ్చి గొర్రెలపై దూసుకెళ్లింది. ఈ సంఘటనలో ఆరు గొర్రెలు మృతి చెందగా.. మరికొన్ని గాయపడ్డాయని తెలిపారు. వీటి విలువ రూ.1.50లక్షలు ఉంటుందని.. గొర్రెలే మా జీవనాధారమని, అధికారులు స్పందించి నష్టపరిహారం వచ్చే విధంగా చూడాలని వారు కోరుతున్నారు.

బొప్పాయి మొక్కలు పీకేశారు..

- మహిళా రైతు ఆవేదన



రైల్వేకోడూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని బీపీరాచపల్లెలో మహిళా రైతు సంగరాజు సరస్వతి ఐదెకరాల పొలంలో బొప్పాయి మొక్కలు నాటుకుంది. వీటిని కొందరు వ్యక్తులు గురువారం సాయంత్రం పెరికేశారని బాధితురాలు రైల్వేకోడూరులో శుక్రవారం మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తన పొలం నుంచి దారి కావాలని వేధింపులకు గురిచేస్తూ.. పొలంలో ఏ పంట వేసినా పీకేస్తున్నారని, కౌలుకు ఇచ్చినా దౌర్జన్యం చేస్తున్నారన్నారు. గతంలో బొప్పాయి, అరటి చెట్లు కూడా పీకేశారని.. కూలీలను కూడా పొలంలోకి రానివ్వకుండా చేస్తున్నారని తెలిపారు. సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయమని రెవెన్యూశాఖ చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

మైదుకూరు రూరల్, జనవ రి 10 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు పట్టణ పరిధిలోని నంద్యాలరోడ్డు బైపాస్ వెంకటాపురం సర్కిల్‌కు సమీపంలో ఆటో నడపుకొని జీవనం సాగిస్తున్న తుపాకుల వెంకటసుబ్బయ్య (50)ను లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆర్లగడ్డ నుంచి మైదుకూరు వైపునకు వస్తున్న లారీ ఢీకొనడంతో ఈ సంఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఇంటర్‌నేషనల్ ఫ్లోర్‌బాల్ క్రీడకు అజ్మతుల్లా



తల్లిదండ్రులతో అజ్మతుల్లా

కడప స్పోర్ట్స్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నగర గాంధీనగర్ పాఠశాలలో విద్యనభ్యసించే షేక్ అజ్మతుల్లా అనే విద్యార్థి ఇంటర్‌నేషనల్ పోటీలకు ఎంపికయ్యాడు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో గత నెల 28, 29, 30 తేదీలలో జరిగిన జాతీయస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలలో ఆంధ్రా జట్టు తరపున పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించి ఇంటర్‌నేషనల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ పోటీలు త్వరలో మలేషియాలో జరుగనున్నాయి. పేద విద్యార్థి అయిన అజ్మతుల్లా ఇప్పటికే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో వివిధ మెడల్స్ సాధించారు. అయితే అజ్మతుల్లాకు ఆ పోటీలలో పాల్గొనే ఆర్థిక స్తోమత లేక మనోవేదనతో సతమతమవుతున్నాడు. కన్న తల్లిదండ్రులు సైతం కూలి పని చేసుకుని జీవనం సాగిస్తూ అజ్మతుల్లాను చదివించుకుంటున్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో కడప జట్టు



ప్రథమ స్థానంలో నిలిచిన కడప జట్టు

ముద్దనూరు జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖకు సంబంధించి అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో కడప జట్టు ప్రథమ స్థానంలో నిలిచినట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరాజావర్మ తెలిపారు. 9,10 తేదీల్లో రెండు రోజులు ఏపీ విద్యుత్ కార్పొరేషన్ ఇంటర్ సర్కిల్ ఫుట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలు అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీల్లో కడప జట్టు ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

నెల్లూరు, కర్నూలు జట్ల విజయం



జాన్‌సన్ (నెల్లూరు), లలిత్‌ఇరగమ్‌రెడ్డి (చిత్తూరు), యశ్వంత్‌సూర్య (కర్నూలు)

కడప స్పోర్ట్స్, జనవరి 10, (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-12 బాలుర ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా శుక్రవారం వివిధ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లలో నెల్లూరు, కర్నూలు జట్లు విజయం సాధించాయి.

నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నెల్లూరు- చిత్తూరు జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన చిత్తూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 35 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేసింది. ఇందులో పి.లలిత్‌ఇరగమ్‌రెడ్డి 61 పరుగులు చేశాడు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 33.3 ఓవర్లలో 160 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. ఇందులో జాన్‌సన్ 55 పరుగులు చేశారు. దీంతో నెల్లూరు జట్టు 4 వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురవేసింది.

కేఓఆర్‌ఎం మైదానంలో అనంతపురం-కర్నూలు జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన అనంతపురం జట్టు బ్యాటింగ్‌కు దిగి 33 ఓవర్లలో 107 పరుగులకు ఆలౌట్ అయ్యింది. కర్నూలు జట్టు బౌలర్ యశ్వంత్‌సూర్య 5వికెట్లు పడగొట్టి స్వల్పస్కోర్‌కే పరిమితం చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు ఉత్కంఠ పోరులో 29 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 110 పరుగులు చేసి ఎట్టకేలకు విజయం సాధించింది.. దీంతో కర్నూలు జట్టు 1 వికెట్ తేడాతో విజయం సాధించినట్లయింది.

భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం

వైభవంగా ఏకాదశి వేడుకలు ● కిటకిటలాడిన సౌమ్యనాథస్వామి ఆలయం ● శ్రీవారి కల్యాణ మహోత్సవం
మార్మోగిన గోవింద నామాలు ● వైష్ణవాలయాలకు పోటెత్తిన భక్తులు ● మధ్యాహ్నం అన్నదానం





రైల్వేకోడూరులో ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు - ఊరేగిన కోదండరాముడు - రాయచోటిలో కల్యాణానికి ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న భక్తులు

రాజంపేట టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి హిందువు తపనపడే వైకుంఠ ద్వార దర్శనం భక్తులకు దేవదేవుడు అనుగ్రహించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు వేకువనుంచే వైష్ణవాలయాలకు పోటెత్తారు. అర్ధరాత్రి ఒంటి గంటకే భక్తులు క్యూలో నిల్చున్నారు. ఫలితంగా వైష్ణవాలయాలు గోవిందనామాలతో మార్మోగాయి. చారిత్రాత్మక నందలూరు సౌమ్యనాథస్వామి ఆలయంలో భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకున్నారు. కొన్ని ఆలయాల్లో శ్రీవారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం దేవ దేవుడిని పురవీధుల్లో ఊరేగించారు. రాజంపేటలోని పలు ఆలయాల్లో ఉత్తర ద్వారం దర్శనం ఏర్పాటు చేశారు. స్వామి వారిని ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. భువనగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, రాజంపేట పట్టణం వేంకటేశ్వరస్వామి ఆలయం తదితర ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. పలువురు మహిళలు భగవద్గీత, విష్ణు సహస్ర నామం, పారాయణం కార్యక్రమాలు నిర్వహించారు.

రైల్వేకోడూరు మండలంలో....

రైల్వేకోడూరు, జనవరి (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి వైభవంగా నిర్వహించారు. వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తాంజనేయస్వామి ఆలయం, బలిజవీధిలో వెలసిన కోదండరామాలయం ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నదానాలు చేశారు.

పోటెత్తిన సౌమ్యనాథస్వామి ఆలయం

నందలూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సౌమ్యనాథస్వామి ఆలయానికి తెల్లవారు జాము నుంచే భక్తులు పెద్దఎత్తున దర్శనానికి తరలివచ్చారు. క్యూలైన్లలో భక్తులతో నిండిపోయి ఆలయం కిటకిటలాడింది. భక్తులకు సౌమ్యనాథ అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు ఎద్దుల సుబ్బరాయుడు, కోశాధికారి చక్రాల రామసుబ్బన్న, ట్రస్టు సభ్యులు పల్లె సుబ్రమణ్యం, జంగంశెట్టి సుబ్బయ్య, బూశెట్టి వెంకటసుబ్బయ్య, లంకయ్యగారి సుబ్బరామయ్య, చక్రాల సాయినాథ్, వంశీ, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని పలు గ్రామాల దేవాలయాల్లో విశేష పూజలు జరిగాయి. ఉప్పరపల్లె, సాయినగర్, పార్వతీపురం, వెంకటేశ్వరపురం ఆలయాల్లోని సీతారాముల మూలవిరాట్టును ఆలయ కమిటీ సభ్యులు గ్రామోత్సవం చేశారు. పాటూరు గ్రామంలో వేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా జరిగింది.

సుండుపల్లె మండలంలో....

సుండుపల్లె, జనవరి10(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆరోగ్యపురం ఎన్‌జీఆర్ కాలనీలో వెలిసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. నిర్వహకులు భక్తులకు తిరుమల లడ్డు ప్రసాదం, అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు.

లక్కిరెడ్డిపల్లె మండలంలో....

లక్కిరెడ్డిపల్లె, జనవరి(ఆంధ్రజ్యోతి): వైష్ణవాలయాల్లో గోవిందనామాలు మార్మోగాయి. లక్ష్మీవేంకటేశ్వర, గంగమ్మదేవాలయం ఉదయం నుంచి భక్తులు పాల్గొన్నారు. లక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో ఆలయ కమిటీ సభ్యుడు కడియాల వెంకట ప్రసాదు దంపతులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

గాలివీడు మండలంలో....

గాలివీడు, జనవరి10(ఆంధ్రజ్యోతి): మండలంలో వైకుంఠ ఏకాదశిని ప్రజలు వైభవంగా చేసుకున్నారు. సంక్రాంతికి గ్రామాలకు చేరుకున్న కుటుంబ సభ్యులు, వారి పిల్లలు కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పెద్దూరులోని పురాతన వేంకటేశ్వర ఆలయానికి భక్తులు విశేషంగా తరలివచ్చి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

చిన్నమండెం మండలంలో....

చిన్నమండెం, జనవరి10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన ఆలయాలన్నీ భక్తులతో క్రిక్కిరిశాయి. చాకిబండ ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం చేపట్టారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. చెక్క భజనలు, కోలాటాలు, డప్పు, ముత్యాలతో భక్తులను కనువిందు చేశాయి. మద్దిరేవుల కుటుంబీకులు గ్రామస్థులు నిర్వహించారు.

మాసాపేట ఆలయంలో...

రాయచోటిటౌన్, జనవరి10(ఆంధ్రజ్యోతి): మాసాపేటలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారికి వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు లక్ష్మీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మెన్ సుగవాసి జానకీరామ్, 1వ వార్డు కౌన్సిలర్ సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్, బోనంశెట్టి తిమ్మయ్య, కొట్టే శ్రీనివాసులు, కొట్టే లక్ష్మీపతి, నారాల సుబ్రమణ్యం, మాదా మాధవ, కదిరి శేషయ్య, చింతం గోపాలకృష్ణయ్య, కేసీప్రసాద్, లాయర్, సతీశ్‌రెడ్డి, బడిశెట్టి రవి, వాకా వాసు, మన్నేరు రామాంజనేయులు పాల్గొన్నారు.

రెడ్డీస్‌కాలనీ ఆలయంలో...

రెడ్డీస్‌కాలనీలోని రామాంజేయస్వామి దేవాలయంలో ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనం చేపట్టారు. దాతలు దొనపాటి మల్లికార్జునరెడ్డి, కావలి వెంకటసుబ్బారెడ్డి, మార్గాని శ్రీనివాసులు, నడి సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, దామోదర్‌రెడ్డి, రేణుకారెడ్డి, దుద్యాల పేరయ్య, కువైట్ నాగరత్న కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మండలంలోని పలు వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

చిట్వేలి మండలంలో....

చిట్వేలి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశితో ఆలయాలు క్రిక్కిరిసిపోయాయి. కేఎస్ అగ్రహారంలోని బునీలా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వారంలో గరుడ వాహనంపై స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి : సీఐటీయూ



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నేతలు

రాజంపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ కోరారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు రవికుమార్ ఆధ్వర్యంలో పురపాలక కార్యాలయం వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62కు పెంచాలని కోరారు. ఎక్స్‌గ్రేషియా పెంపుదల, కార్మికుల దహన సంస్కారాలకు రూ.20 వేలకు పెంచాలని, ఇంజనీరింగ్ కార్మికులకు జీఓ 36 ప్రకారం జీతాలు చెల్లించాలన్నారు. మున్సిపల్ కార్మికులు సీవీ రమణ, జి.రమణ, ఎ.బాలాజీ, ఎంవి రమణ, కోదండరామయ్య, బుజ్జమ్మ, కె.ప్రసాద్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

పశుపోషకులకు ఉపయోగం గోకులం షెడ్లు

టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు



గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న జగన్‌మోహన్‌రాజు

వీర బల్లి, జనవరి10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో గోకులం షెడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టిందని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్ రాజు అన్నారు. మినీ గోకులం షెడ్లు పశుపోషకులకు ప్రయోజనకరమని, గ్రామాల్లో మినీ గోకులం షెడ్ల నిర్మాణాలపై పాడి రైతుల్లో కూడా ఆసక్తి పెరిగిందన్నారు. శుక్రవారం రాజంపేట నియోజకవర్గం వీరబల్లి మండలం మట్లి గ్రామంలో పర్యటిస్తూ అధికారులు, ముఖ్య నేతలతో కలిసి గోకులం షెడ్లను ప్రారంభించారు. గోకులం పథకం రైతులకు సహాయం చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. ఈ పథకం ద్వారా పాడి పరిశ్రమను ప్రోత్సహించడం, పాడి రైతులకు ఆర్థిక సహాయం అందించడం పశువుల ఆరోగ్య సంరక్షణ అధిక పాల ఉత్పత్తి లక్ష్యంగా, రైతులకు అవసరమైన సహాయాలను అందిస్తుందన్నారు. పశువుల పెంపకం దారులకు ఆర్థికంగా మద్దతు లభించడం, పవువుల ఆరోగ్యం ఉత్పత్తి సార్థ్యం పెంపొందించడానికి సహకారం అందిస్తారని, మంచి వాతావరణంలో పశువులకు షెడ్లు కల్పించడం, పెంపకం దారుల ఆదాయ ఉత్పత్తికి తోడ్పడుతుందన్నారు. అధికారులు, మండల పార్టీ అధ్యక్షుడు భానుగోపాల్ రాజు, లక్ష్మయ్య, సర్పంచ్ నాగార్జునాచారి, మండల ఉపాధ్యక్షులు దుర్గమ్మ, నాగరాజు నాయుడు, నాగభూషణం నాయుడు, నంద కుమార్ నాయుడు, రెడ్డెప్పరెడ్డి, రాంమోహన్‌రెడ్డి, వెంకట్రమణ పాల్గొన్నారు.

పాడి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం

సంబేపల్లె, జనవరి10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతుల కోసం కూటమి ప్రభుత్వం గోకులం షెడ్లను ఏర్పాటు చేసినట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నాగిరెడ్డిగారిపల్లె గ్రామం పోతువాండ్లపల్లె, బండకాడపల్లిలో రైతులు గోకులం షెడ్లను ప్రారంభించారు. గోకులం షెడ్ నిర్మాణం త్వరగా పూర్తి చేసినందుకు రైతులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామచంద్ర, యువగళం సభ్యులు మండిపల్లి సిద్దారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి, ఏపీయం సంజీవరాజు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులూ... స్పందించండి

లక్కిరెడ్డిపల్లె, జనవరి10(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై అధికారులు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. రామాపురం - లక్కిరెడ్డిపల్లె మార్గంలో ఆర్‌టీసీ బస్సు ఏర్పాటు చేయాలని గత సమావేశంలో మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి ఆదేశించినా అధికారులు పట్టించుకోలేదని సర్పంచులు సభ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ నెల 20 నుంచి ప్రతి గ్రామంలో భూముల రీసర్వే చేపటడుతున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాడినప్పటి నుంచి మండలంలో రూ.1.40 కోట్ల రూపాయల సిమెంటు రోడ్లు ఏర్పాటు చేశామని మండల ఇంజనీర్ సుబ్రమణ్యం అన్నారు 2025 సంవత్సరానికి కోటి రూపాయాలు మేరకు నివేదికలు పంపించామన్నారు. ఎంపీడీఓ రెడ్డెయ్య మాట్లాడుతూ ఉపాధిహామిలో అక్రమాలు జరగకుండా జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

'ప్రభుత్వాలు మారినా మారని జీవితాలు'



రాయచోటి మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

రాయచోటిటౌన్, జనవరి10(ఆంధ్రజ్యోతి): ఎన్ని ప్రభుత్వాలు మారినా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీవితాల్లో మార్పు రాలేదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ, గౌరవాధ్యక్షుడు శంకరయ్య అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో రాయచోటి మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. రాష్ట్ర కమిటీలతో చర్చలు నిర్వహించి జీఓ 36ను అమలు చేసి జీతాలు పెంచుతామని, వైసీపీ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, నేటికీ తెచ్చిన జీఓ నోటి మాటకు తెల్లకాగితాలకే పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 15 వేలు జీతాలను చెల్లిస్తూ పర్మినెంట్ చెయ్యని ఉద్యోగుల కుటుంబాలకు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. మిగతా ఉద్యోగులు, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు కూడా ఉద్యోగులేనని వారు కూడా రాష్ట్రంలోనే ఉన్నారనే విషయాన్ని గుర్తించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం 36 జీఓను అమలు చేస్తూ, తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తూ ఉద్యోగ భరోసా కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు

ఓబులవారిపల్లె, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ హరిత తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సంప్రదాయ వేషధారణలో హాజరై కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణంలో నెలకొంది. ఈ సందర్భంగా కళాశాలలో ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు, కోలాటాలు వంటి సంప్రదాయ కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనిపించని లక్ష తులసి అర్చన

సిద్దవటం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సౌమ్యనాథస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఏటా భక్తుల సమక్షంలో లక్ష తులసి అర్చన నిర్వహించడం ఆనవాయితీ. ఈసారి నిర్వహించకపోవడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. సుదూర ప్రాంతాల నుంచి ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో టీటీడీవారు విఫలం చెందారని పలువురు భక్తులు ఆరోపించారు. భక్తులకు కనీసం తాగునీరు, అన్నదానం ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీఐపీలకే ఎక్కువ ప్రాధాన్యత కల్పించారన్నారు.

ఆకట్టుకున్న రంగవల్లులు



ముగ్గులను పరిశీలిస్తున్న అసోసియేట్ డీన్ శ్రీనివాస్

రైల్వేకోడూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆవరణలో సంక్రాంతి సందర్భంగా శుక్రవారం విద్యార్థినులు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పీటీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. 28 మంది విద్యార్థినులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వై. దీప్తికిరణ్, నిశ్చల పాల్గొన్నారు.

అదుపు తప్పి బోల్తా పడిన ఆయిల్ వ్యాను



రోడ్డుపై బోల్తాపడిన ఆయిల్‌వ్యాను

ఒంటిమిట్ట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె సమీపంలో అదుపు తప్పి వాహనం బోర్లా పడడంతో ఆటోలోని సంగ్రాప్ కంపెనీకి చెందిన 300 ఆయిల్ డబ్బాలు రోడ్డుమీద పడ్డాయి. స్థానిక పోలీసులు, ఎస్ఐ శివప్ర సాద్ తెలిపిన వివరాల మేరకు తిరుపతి నుంచి కడపకు ఆయిల్ లోడుతో వెళుతున్న ఆటో చెర్లోపల్లె వద్ద టైరు పగలడంతో అదుపుతప్పిన ఆటో బోల్తా పడింది. నూనె మొత్తం రోడ్డుపైన పడడంతో ట్రాఫిక్ అంత రాయం ఏర్పడింది. ఆటోలోని వ్యక్తులు స్వల్ప గాయాలతో బయట పడ్డారని కేసు నమోదు చేశారు. సీఐ బాబు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

రేపు పొంగళ్లు

పుల్లంపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తిప్పాయపల్లెలో ఆదివారం సంజీవరాయుడికి పొంగళ్లు నిర్వహించనున్నారు. సంక్రాంతి ముందు వచ్చే ఆదివారం గ్రామస్థులు సంజీవరాయుడికి పురుషులే పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించడం ఇక్కడి ఆచారం. ఆలయంలో మహిళలకు ప్రవేశంలేదు. సంజీవరాయుడికి గుడి కూడా లేదు. ఒక రాతి బండపై రాసిన బీజాక్షరాలను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో పూజిస్తున్నారు.

ఉపరితల ఆవర్తనంతో రైతన్నల ఆందోళన

పెనగలూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం కారణంగా మండల వ్యాప్తంగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం దాకా ముసురేసింది. సాయంత్రం ఐదు గంటలకు కొంతసేపు అక్కడక్కడా జల్లులతో కూడిన వర్షం కురిసింది. ఉన్నట్టుండి వాతావరణం ఒక్కసారిగా మారిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాటికి పూత, పిందెతో కనిపించాల్సిన మామిడి తోటలో వాతావరణ కాలుష్యం వల్ల కనీసం మొగ్గలు కూడా రాకపోవడంతో సంక్రాంతి పండుగ తర్వాత అయినా ఎండలు కాస్తే తోటలకు మందులు పిచికారీ చేద్దామనుకుంటున్న తరుణంలో అకస్మాత్తుగా మారిన వాతావరణం, మబ్బులతో రైతులు దిగులు పడుతున్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

రాజంపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాజంపేట, నందలూరు ప్రాంతాల్లో సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం నుంచి కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ ఎం.సురేంద్రనాద్ తెలిపారు. ఆకేపాడు, నందలూరు, రాజంపేట, కట్టకింద పల్లె, చెర్లోపల్లె, తాళ్లపాక సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. 33/11కేవీ లైన్ల మరమ్మతులు కారణంగా విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు వినియోగదారులు సహకరించాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

మినీ గోకులం ప్రారంభించిన ముక్కా



మినీ గోకులం ప్రారంభిస్తున్న ముక్కా రూపానందరెడ్డి

పుల్లంపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): దళవాయిపల్లెలో ఉపాధి పథకం కింద నిర్మించిన మినీ గోకులాన్ని టీడీపీ ఇన్‌చార్జి, అన్నమయ్య జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. పద్మాకర్‌రెడ్డి రైతు పొలంలో రూ.2.30 లక్షలతో చేపట్టిన మినీ గోకులాన్ని ప్రారంభించారు. పాడిరైతులకు గోకులాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళుతోందన్నారు. గ్రామంలోని మహిళలు ఉపాధిహామీ పనిదినాలను 150 రోజులకు పెంచాలని కోరారు. టీడీపీ నేతలు రాజారెడ్డి, సిద్దారెడ్డి, ఏపీఎస్ యాదవ్, లింగొట్ల వెంకటరమణ, గంగిరెడ్డి, ఆదినారాయణ రెడ్డి, జనసేన నేతలు వెంకటసుబ్బయ్య, వసుపులేటి సుబ్బయ్య పాల్గొన్నారు.

20 సూత్రాల అమలుపై అవగాహన అవసరం

రాజంపేట పార్లమెంట్ బీజేపీ సమావేశంలో 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్



మాట్లాడుతున్న లంకా దినకర్, చిత్రంలో సాయిలోకేష్, రమేష్‌నాయుడు

రాజంపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అధికారులకు స్పష్టమైన అవగాహన లేకపోవడం బాధాకరమని, వారు పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని రాష్ట్ర 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ అధ్యక్షతన జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం అమలు పరుస్తున్న 37 పథకాలపై అధికారులకు సరైన అవగాహన లేదన్నారు. ఈ పథకాలపై ప్రజలకు సరైన సమాచారం లేదన్నారు. ఈ పథకాలపై అవగాహన కల్పించి ప్రజలకు చేరువయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విజయనగరం, శ్రీకాకుళం వెనుక బడిన జిల్లాలని, వాటితో పాటు వెనుకబాటు తనంలో అన్నమయ్య జిల్లా కూడా ఉందన్నారు. ఈ జిల్లా అభివృద్ధికి అన్ని విధాల చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ మాట్లాడుతూ లంకా దినకర్‌కు అత్యంత ప్రాధాన్యత గల 20 సూత్రాల కమిటీ చైర్మన్‌గా నియమించడంతో అందరికీ ప్రయోజనం కలుగుతుందన్నారు. పేద, బలహీన వర్గాలను ఆదుకోవచ్చనన్నారు. రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు, బీజేపీ నేతలు సురేష్ రాజు, కృష్ణయాదవ్, రాష్ట్ర మైనార్టీ నాయకులు షబ్బీర్ అహ్మద్, మహిళా మూర్తి అధ్యక్షురాలు సునీత నారాయణ, మస్తానయ్య, చెంగల్‌రాజు, రాంప్రసాద్, ఆదినారాయణ, మస్తానయ్య, సురేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే ప్రాధాన్యత

● రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదాశివం



పీలేరులో జరిగిన అభినందన సభలో మాట్లాడుతున్న సదాశివం

పీలేరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ హయాంలోనే రాష్ట్రంలోని నాయీబ్రాహ్మణులకు రాజకీయ, సామాజిక, ఆర్థిక ప్రాధాన్యత దక్కిందని ఆ సంఘం కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం పేర్కొన్నారు. పీలేరు నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల పేద పరిస్థితులను చూసిన దివంగత సీఎం ఎన్టీఆర్ 1989లో ఫెడరేషన్ ఏర్పాటు చేశారని, తదనంతర కాలంలో సీఎం చంద్రబాబు దాన్ని కార్పొరేషన్‌గా మార్చారన్నారు. ఈ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలోని లక్షలాది మంది నాయీబ్రాహ్మణులు అటు వృత్తి, ఇటు వ్యక్తిగత జీవితాల్లో ఎంతో అభివృద్ధి చెందారన్నారు. టీటీడీ పాలకమండలి లోనూ ఇద్దరు నాయీబ్రాహ్మణులకు స్థానం కల్పించిన ఘనత చంద్ర బాబుకే దక్కిందన్నారు. గత ఐదేళ్ల కాలంలో జగన్ సర్కారును బీసీలను పూర్తిగా విస్మరించిందని, పేరుకు 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా నిధులు, విధులు లేకపోవడంతో అవి అలంకారప్రాయంగా మిగిలిపోయా రన్నారు. అనంతరం ఆయనను స్థానిక నాయకులు ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.మల్లికార్జున, మాజీ ఎంపీపీ మహితా ఆనంద్, పీలేరు సంఘం అధ్యక్షుడు ఎర్రయ్య, సభ్యులు రాజగోపాల్, ఆంజనేయులు, రమేశ్, గిరి, వాణి, వెంకటరమణ, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ



అవగాహన కల్పిస్తూ మానవహారంగా ఏర్పాటు చేసిన దృశ్యం

సంబేపల్లె, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు సిబ్బందికి జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ ఆదేశాల మేరకు ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ నిర్వహించినట్లు డివిజినల్ మోడల్ మేకింగ్ ట్రైనర్ సుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం రౌతుకుంట రైతు పీరుసాబ్ పొలంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం భవిష్యత్ తరాలకు ఒక దివ్య ఔషధమని, యువత వారికున్న సమయంలో వ్యవసాయానికి కూడా కొంత భాగం కేటాయిస్తూ వ్యవసాయ రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం రైతులకు పెట్టుబడులు తగ్గిస్తూ మంచి ఆహార ఉత్పత్తులు మానవాళికి అందించేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు, ప్రజలు, మహిళా సంఘ సభ్యులు, జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ మండల సిబ్బంది, ఐబీఐసీఆర్‌పీలు, ఐసీఆర్‌పీలు, యూనిట్ ఇన్‌చార్జిలు, మాస్టర్ ట్రైనర్ మానస, ఎన్ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

● జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి

నందలూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలని జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి కార్యదర్శులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులతో శుక్రవారం రివ్యూ మీటింగ్ నిర్వహించిన ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులు వసూలు, సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం నందలూరు, పాటూరు పంచాయతీల్లోని సంపద తయారీ కేంద్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు టీడీపీ నాయకులు మోడ పోతుల రాము తదితరులు పాల్గొన్నారు.



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ బాలకృష్ణారెడ్డి

ఆటో సారథులుగా.. మహిళలు



● అదనపు ఆదాయంతో జీవనోపాధులు

● ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు

కడప ఎన్టీఆర్‌సర్కిల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అవని నుంచి ఆకాశం వరకు అన్నింటా తాము ఉంటామంటూ పోటీపడుతున్న అతివలు వచ్చిన అవకాశాలు అందిపుచ్చుకుంటూ మెరుగైన జీవనోపాధుల వైపు దూసుకెళ్తున్నారు. ఆటో సారథులుగా సైతం మహిళలు రాణిస్తున్నారు. ప్రభుత్వాలు వారిని ప్రోత్సహిస్తూ చేయూతనిస్తున్నాయి. స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులకు మెరుగైన జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. ఇందులో భాగంగా ఉత్సాహమున్న మహిళలకు తాము ఎంచుకున్న వ్యాపారంలో రాణించేందుకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇందులో భాగంగా వైఎస్సార్ కడప జిల్లాలో 12 మందికి ఆటోలు ఇప్పించారు. వీటిని స్వయంగా మహిళా సభ్యులు నడుపుతూ కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. సెర్ప్ ఉన్నతి మహిళా శక్తి ద్వారా ఆటోలు అందజేశారు. 8 మంది ఎస్సీలు, నలుగురు ఎస్టీ మహిళలు లబ్ధిపొందారు. ఇందుకోసం రూ.35,28,770 ఖర్చుచేశారు. ఇందులో రూ.31,41,228 రుణం అందించగా రూ.3,85,949 లబ్ధిదారుల వాటాగా వసూలు చేశారు. లబ్ధిదారులు ఆటోకోసం పొందిన రుణం పూర్తిగా వడ్డీ లేకుండా 48 కంతుల్లో తిరిగి చెల్లించే విధంగా ప్రణాళిక రూపొందించారు. లబ్ధిపొందిన వారిలో ప్రొద్దుటూరు మండలం లింగాపురంలో ఇద్దరు, ఒంటిమిట్ట మండలం యానాది గ్రామ సమాఖ్యలో ఇద్దరు గిరిజన మహిళలు ఉండగా.. ప్రొద్దుటూరు, వల్లూరు, పులివెందుల, సిద్దవటం, పెండ్లిమర్రి మండలాలకు చెందిన ఎనిమిది మంది దళిత మహిళలు ఉన్నారు.



ఆటోల పంపిణీని ప్రారంభించిన కలెక్టర్ విజయరామరాజు (ఫైల్)

అదనపు ఆదాయంతో జీవనం

లబ్ధిదారులు తాము స్వయంగా ఆటోలు నడుపుతూ కుటుంబానికి అదనపు ఆదాయం సమకూరుస్తుండటంతో మెరుగైన జీవితం సాగిస్తున్నారు. పెండ్లిమర్రి మండలానికి చెందిన ఒక లబ్ధిదారు యోగివేమన యూనివర్సిటీకి అవసరమైన కూరగాయలు తీసుకురావడంతో పాటు స్థానికంగా ప్యాసింజర్లను చేరవేస్తున్నారు. వీరిలో చాలా మంది లబ్ధిదారులు పొలం పనులకు కూలీలను తీసుకెళ్లడం, అక్కడే వారితో పాటు వ్యవసాయ పనులు చేయడంతో ఒకవైపు ఆటో బాడుగ మరోవైపు కూలీ డబ్బులు సంపాదించే అవకాశం రావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో మహిళ తాను స్కూల్ పిల్లలను తీసుకొని వెళ్లడం, మధ్యాహ్నం భోజనం క్యారియర్లు తీసుకొని వెళ్లడం వల్ల పనిదొరికిందని.. దీంతో కుటుంబానికి ఎంతో ఆసరా దొరికిందని అంటున్నారు.

ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు

స్వయం సహాయక సంఘాలు అభివృద్ధి సాధిస్తుండడంతో ఆ సంఘాల్లోని సభ్యులను ప్రభుత్వాలు మరింత ప్రోత్సహిస్తున్నాయి. సభ్యుల అభిరుచులకు అనుగుణంగా వివిధ రంగాలలో వ్యాపారం చేసుకుని మరింత ఆర్థిక అభివృద్ధిని సాధించేందుకు పేదరిక నిర్మూలన సంస్థ చర్యలు తీసుకుంటోంది. దీంతో స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు చిరు వ్యాపారం నుంచి పరిశ్రమలు ఏర్పాటుచేసే స్థాయికి ఎదుగుతున్నారు. 50కి పైగా సంఘాలకు రూ.100 కోట్లకు పైగా ఆర్థికసాయం అందించేందుకు సెర్ప్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ సంఘాల్లోని ఒక్కొక్క సభ్యురాలికి వారు ఏర్పాటుచేసే పరిశ్రమను బట్టి రూ.10లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఆర్థికసాయం అందిస్తున్నారు. మహిళా సంఘాల సభ్యులు కూడా తాము పొందిన రుణాలు సకాలంలో తిరిగి చెల్లించి నమ్మకాన్ని ఏర్పరచుకోవడంతో కోరినంత రుణం ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకొస్తున్నారు.

పేదరిక నిర్మూలన కోసం చర్యలు

- ఆనంద్‌నాయక్, పీడీ, డీఆర్‌డీఏ



స్వయం సహాయక సంఘాల్లోని మహిళల పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సంఘంలోని ప్రతి మహిళకు ఏదో ఒక పథకం ద్వారా ఆర్థిక లబ్ధిచేకూర్చి వారికి మరింత మెరుగైన జీవనోపాధులు కల్పించడం కోసం చర్యలు తీసుకుంటున్నాం. సెర్ప్ ఆదేశాలకు అనుగుణంగా, మహిళా సంఘాల్లోని సభ్యుల ఆసక్తిని బట్టి వారి జీవనోపాధికి అవసరమైన ఆర్థిక వనరులు సమకూర్చుతున్నాం.

బడి పిల్లలను తీసుకెళ్లడం వల్ల ఉపాధి

- లత, ఉన్నతి లబ్ధిదారు, ప్రొద్దుటూరు



నేను స్వయం సహాయక సంఘంలో చేరిన తర్వాత పొదుపు చేసుకోవడంతో పాటు చిన్నచిన్న మొత్తాల్లో రుణం పొంది సకాలంలో తిరిగి చెల్లించేదాన్ని. 10వ తరగతి వరకు చదువుకున్న నేను ఆటో డ్రైవింగ్‌లో కూడా ప్రావీణ్యం పొందాను. డీఆర్‌డీఏ, వెలుగు వారు రుణం కింద ఆటో ఇప్పించారు. దాని ద్వారా సంపాదించుకుంటూ మెరుగైన జీవనం సాగిస్తున్నా. ఇళ్ల వద్ద నుంచి బడి పిల్లలను పాఠశాలకు తీసుకువెళ్లి తిరిగి తీసుకురావడం ద్వారా ఉపాధి లభించింది. ఖాళీ సమయంలో బాడుగలకు వెళ్లడం, ప్యాసింజర్లను తీసుకెళ్లడంతో అదనపు ఆదాయం వస్తుంది. నెలకు దాదాపు రూ.20వేల నుంచి రూ.25వేలు సంపాదించుకుంటున్నా. ఆటోకు నెలవారీ కంతుపోను మగిలిన సొమ్ముతో కుటుంబపోషణ చేసుకుంటున్నా.

పేదరికం నుంచి బయటపడుతున్నా

- వెంకటసుబ్బమ్మ, లబ్ధిదారు, నందనగర్, ఎస్టీ కాలనీ, ఒంటిమిట్ట



నేను కూలి పని చేసుకుంటూ, అడవిలో గడ్డలు ఏరుకుంటూ అతిపేదరికంలో జీవనం సాగించేదాన్ని. తర్వాత పొదుపు సమంలో చేరాను. ఆ సంఘం ద్వారా నెలనెల పొదుపు చేసుకుని బ్యాంకులో లోన్ పొంది సక్రమంగా చెల్లించాను. దీంతో తిరిగి బ్యాంకులోన్ తీసుకుని మేకలు పట్టుకుని జీవిస్తూ ఉండేవాళ్లం. తర్వాత వెలుగు అధికారులు ఆటో లోన్లు వచ్చాయని చెప్పారు. నేను టెన్త్ వరకు చదువుకున్నాను. మా గూడెంలో వేరే వాళ్ల వద్ద ఆటో నేర్చుకుని లోనుకు అప్లయ్ చేసుకున్నాను. రూ.2,70,000 ఉన్నతి లోన్ మంజూరైంది. ప్రతినెల రూ.6వేలు కంతు చెల్లిస్తున్నాను. ఆటో నడపడం వల్ల జీవనోపాధి మెరుగుపడింది. నా పిల్లల చదువు అన్నీ సక్రమంగా జరుగుతున్నాయి.

బంకుల విషయమై గుర్రంకొండలో ఉద్రిక్తత...!

● ప్రభుత్వ స్థలం ఆక్రమణ



బంకుల విషయమై ఘర్షణ పడుతున్న యువకులు

గుర్రంకొండ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉన్న బీఎల్‌డబ్ల్యూ క్వార్టర్స్ స్థలంలో అక్రమంగా రేకు బంకులను ఏర్పాటు చేస్తుండడంతో శుక్రవారం రాత్రి ఉద్రిక్తత చోటు చేసుకుంది. వందలాది మంది యువకులు ఓ చోట గుమికూడి బంకుల ఏర్పాటును అడ్డుకోవడంతో కొంత సేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. ఘటన స్థలానికి పోలీసులు చేరుకోవడంతో సర్దుమనిగింది. పట్టణ నడిబొడ్డున బీఎల్‌డబ్ల్యూ క్వార్టర్స్ ఉంది. ఇవి శిథిలావస్థకు చేరుకుంది. ఈ స్థలాన్ని గత ప్రభుత్వ హయాంలో కొంతమంది వైసీపీ నాయకులు ఆక్రమించుకొని కబ్జాకు యత్నించారు. అప్పట్లో జిల్లా అధికారులకు ఆక్రమణలపై ఫిర్యాదులు వెల్లడంతో అలానే వదిలేశారు. ఈ క్రమంలో కొంత స్థలంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయగా మిగిలిన స్థలం ఖాళీగానే ఉంది. ప్రస్తుతం ఈ స్థలం 2 కోట్లకు పైగా విలువ చేస్తుంది. ఈ నేపథ్యంలో ఖాళీ స్థలంలో కొందరు నాయకులు రేకుల బంకులను ఏర్పాటు చేయడానికి సిద్ధమయ్యారు. ఈ రేకులషెడ్డులను ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయరాదంటూ అదే వర్గంలోని వందలాది మంది యువకులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని అల్లరిమూకలను తరిమేశారు. అధికారుల అనుమతులు లేకుండా ఎటువంటి బంకులను ఏర్పాటు చేయకూడదని పోలీసులు సూచించారు.

అప్పు చెల్లించలేదని వడ్డీ వ్యాపారి దాడి



తీవ్రంగా గాయపడిన మోహన్ రావు

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 10(ఆంధ్రజ్యోతి): అప్పు చెల్లించ లేదని పట్టాణానికి చెందిన మారెళ్ల మోహన్ రావుపై వడ్డీ వ్యాపారి సుగవాసిబాబు శుక్రవారం దాడి చేశాడు. బాధితుడి వివరాల మేరకు.. తాను వడ్డీ వ్యాపారి సుగవాసిబాబు వద్ద కొంత నగదును తీసుకు న్నానని, వ్యాపారపరంగా నష్టపోయి ఇబ్బందుల్లో ఉన్న సమయంలో డబ్బులు చెల్లించాలని వేధించే వాడన్నారు. డబ్బులు ఇచ్చేందుకు కొంత సమయం కావాలని వేడుకున్నా వినకుండా రెడ్డివారిపల్లి సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలోకి పిలిపించి డబ్బుల విషయంగా చర్చిస్తుండగా తనపై మద్యం బాటిల్‌తో దాడి చేశాడని ఆరోపించారు. ఈ మేరకు బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గాయపడిన బాధితుని పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్‌బాబు తెలిపారు.

ఆక్రమణదారుల నుంచి మా భూమి ఇప్పించండి మహాప్రభో



రైతు పత్తి సుబ్బరాయుడు

ఓబులవారిపల్లె, జనవరి 10: మండల పరిధిలోని చెన్నరాజుపోడు గ్రామ రెవెన్యూ పరిధిలో తమ భూమిని ఆక్రమించి దౌర్జన్యాలు చేస్తున్నారని, తనకు న్యాయం చేయాలని బాధితుడు పత్తి సుబ్బరాయుడు వాపోతున్నాడు. శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. మండల పరిధిలోని చెన్నరాజుపోడు రెవెన్యూ పరిధిలో తనకున్న భూములకు సంబంధించి ఒక ఎకరా 75 సెంట్లు భూమి ఆక్రమణకు గురైందని, తమ భూమిని తమకు ఇప్పించండి మహాప్రభో అంటూ అధికారులను వేడుకుంటున్నా పట్టించుకోలేదని రైతు సుబ్బరాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. తనకున్న భూమిలో 10 ఎకరాల 80 సెంట్లు గతంలో విక్రయించానని, సదరు భూమి కొన్న వ్యక్తి తాము లేని సమయంలో 12 ఎకరాల 55 సెంట్లు భూమిని అక్రమంగా దౌర్జన్యంగా ఆక్రమించారని కన్నీటిపర్యంతమయ్యారు. అప్పటి నుంచి అనేకసార్లు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగి అర్జీలు ఇచ్చినా, భూమి కొలతలకు చలానాలు కట్టినా ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించాడు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సులో కూడా ఫిర్యాదు చేసినప్పటికి స్థానిక అధికారులు పట్టించుకోలేదని లబోదిబోమంటున్నాడు. గతంలో పొలం దగ్గరకు వెళితే తనపై దౌర్జన్యాలు, హత్యాయత్నం కూడా చేశారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధించిన అధికారులు స్పందించి మండల రెవెన్యూ సర్వేయర్‌తో కొలతలు వేయించి తమ భూమిని తమకు ఇప్పించాలని వేడుకుంటున్నాడు.

21న ఏకసభ్య కమిషన్ పర్యటన

పీలేరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో ఈ నెల 21న జరగనున్న రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ పర్యటనను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు తమ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కమిషన్ పర్యటన నేపథ్యంలో శుక్రవారం పీలేరులో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, వాటి అనుబంధ సంఘాల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుద్దు రామకృష్ణ మాదిగ, రాష్ట్ర కార్యదర్శి దుమ్ము చిన్నమాదిగ, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు రవీంద్ర మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితంగా షెడ్యూల్ కులాలలోని 59 ఉపకులాలకు వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ లభించే అవకాశం దక్కిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ (ఏకసభ్య కమిషన్) ఈ నెల 21న చిత్తూరుకు రానుందన్నారు. ఆ రోజున పీలేరు నియోజకవర్గంలోని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాస్వామికవాదులు, మాదిగ ఉపకులాల ప్రజలు పెద్దఎత్తున చిత్తూరుకు తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండికోట వెంకటేశ్, నాయకులు అమరాల వెంకటరమణ, చరణ్ కుమార్, రామ్మోహన్‌రెడ్డి, విశ్వనాథ, నాగేశ్వరరావు, మహేశ్, రమణ, శ్రీరాములు, నాగరాజ, రెడ్డమ్మ, మాధవి, సుగుణ, నాగరాజమ్మ, తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తున్న ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ శ్రేణులు





ఆహో.. ఏమి రుచి..!



ఆకలి రుచి ఎరుగదని పెద్దలు అంటుంటారు. అది మనిషి అయినా.. పక్షి అయినా.. జంతువైనా.. ఆకలి అందరికీ ఒక్కటే. ఈ కోవలోనే ఓ రామచిలుక ఆకలి బాధ తాళలేక ఓ చెట్టుకు ఉన్న మొగ్గను తన నోటితో కొరుకుతూ కనిపించింది. సాధారణంగా రామచిలుక జామపండ్లు, మామిడిపండ్లు, తదితర పండ్లను తింటూ ఉంటుంది. కానీ ఆహారం కోసం ఎక్కడెక్కడ తిరిగిందో కానీ ఏదీ దొరక్క చివరకు అవిసి కొమ్మకు ఉన్న మొగ్గను ఆస్వాదిస్తూ 'ఆహా.. ఏమి రుచి.. తినరా మైమరిచి' అని లొట్టలేసుకుంటూ తినింది. చింతకొమ్మదిన్నె మండలం, బాలుపల్లె వద్ద ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప

పశువైద్యసేవలను మెరుగుపరచాలి

● జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శారదమ్మ


ఏపీఎన్జీవీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

కడప రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పశువైద్యసేవలను మరింతగా మెరుగుపరిచి ప్రభుత్వ లక్ష్యసాధనకు పాటుపడాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ సి.శారదమ్మ తెలిపారు. జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయ సమావేశహాలులో శుక్రవారం ఏపీఎన్జీవీఎఫ్ 2025 సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శారదమ్మ మాట్లాడుతూ ఏపీఎన్జీవీఎఫ్ జిల్లా ఛైర్మన్ నంద్యాల రాజశేఖర్ ఆధ్వర్యంలో తీసుకొచ్చిన క్యాలెండర్, డైరీ ఉద్యోగుల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తోందన్నారు. ఆదే స్ఫూర్తితో అన్ని క్యాడర్ల ఉద్యోగులందరు కలిసికట్టుగా బాధ్యతగా పనిచేసి పశుపోషణదారులకు అందుబాటులో ఉంటూ శాఖ ఉన్నతికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎన్జీవిఎఫ్ జిల్లా ఛైర్మన్ నంద్యాల రాజశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చాంద్ బాషా, నాయకులు సదాశివయ్య, బాబునాయక్, కిరణ్‌కుమార్‌రెడ్డి, శివలక్షుమ్మ, వరదయ్య, పెంచలరాజు తదితరులు ఉన్నారు.

ఏడుగురికి టీడీపీ శాశ్వత సభ్యత్వం

● ఒక్కొక్కరు రూ.లక్షతో నమోదు


రితీష్‌రెడ్డి సమక్షంలో టీడీపీ శాశ్వత సభ్యత్వ నమోదు చేసుకున్న అట్లూరు మండల నాయకులు

అట్లూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీపై ఉన్న నమ్మకం, అభిమానంతో మండలంలోని ఏడుగురు టీడీపీ నాయకులు ఒక్కొక్కరు లక్ష రూపాయలు చెల్లించి శాశ్వత సభ్యత్వం నమోదు చేసుకున్నారు. శుక్రవారం బద్వేలులో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రితీష్‌రెడ్డి సమక్షంలో టీడీపీ సీనియర్ నాయకులు బోవిళ్ల నంద గోపాల్‌రెడ్డి, మంచూరి సూర్యనారాయణరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లిఖార్జునరెడ్డి, ఆరవ శ్రీనివాసులరెడ్డి, పోతిరెడ్డి రెడ్డయ్య, పాలకొండు రామచంద్రారెడ్డి, పాలకొండు రాజశేఖర్‌రెడ్డి టీడీపీ శాశ్వత సభ్య త్వం తీసుకున్నారు. ఈసందర్భంగా రితీష్‌రెడ్డి వారిని అభినందించారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతున్న వారికి పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. నియోజకవర్గంలోనే అట్లూరు మండలం సభ్యత్వ నమోదులో ముందంజలో ఉందన్నారు. టీడీపీ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని కోరారు.

బండలాగుడు పోటీల్లో విజేతగా నిలిచిన చౌటిపల్లి ఎద్దులు


విజేతలకు బహుమతులు అందిస్తున్న గ్రామస్థులు

పులివెందుల టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మండల పరిధిలోని ఉలిమెళ్ల గ్రామంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన బండలాగుడు పోటీల్లో చౌటిపల్లెకు చెందిన చంద్ర ఎద్దులు ప్రథమ బహుమతిని సాధించాయి. గ్రామ సమీపంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో గ్రామస్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో చౌటిపల్లి గ్రామానికి చెందిన చంద్ర ప్రథమస్థానంలో నిలవగా మొదటి బహుమతిని కింద రూ. 50వేలు అందించారు. రెండో బహుమతి రూ.40వేలు, మూడో బహుమతి రూ.30వేలు, నాలుగో బహుమతి రూ.20వేలు, ఐదో బహుమతి 10వేలు నగదును గ్రామస్తులు విజేతలకు అందించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి 'సీమ' సంగీత నృత్యోత్సవాలు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ గీతాశ్రమంలో శనివారం నుంచి సోమవారం వరకు మూడు రోజులపాటు రాయలసీమ సంగీత నృత్యోత్సవాలను నిర్వహిస్తున్నట్లు నటరాజ కళాక్షేత్రం నాట్య గురువు మొహిద్దీన్‌ఖాన్ తెలిపారు. కళలను, కళాకారులను ప్రోత్సహించడానికి ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో రాయలసీమ, బళ్లారితోపాటు కర్ణాటక ప్రాంతానికి చెందిన 250మందికి పైగా కళాకారులు పాల్గొని కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలను ప్రదర్శిస్తారన్నారు. ఈ సందర్భంగా పలువురికి రాయలసీమ సంగీత రత్న, నృత్య రత్న అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, కేంద్ర సాంస్కృతిక శాఖ సభ్యుడు వేదాంతం రామలింగ శాస్త్రి, ఎస్వీ సంగీత నృత్య కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ జమునారాణి, వెంకటసుబ్రమణ్యం తదితరులు పాల్గొంటారన్నారు.

శేషవాహనంపై బ్రహ్మంగారి దర్శనం


ఆలయ పురవీధుల్లో శేషవాహనంపై ఊరేగుతున్న వీరబ్రహ్మేంద్రస్వామివారు

బ్రహ్మంగారిమఠం, జనవరి 10 (ఆంధ్ర జ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మం గారిమఠం దేవస్థా నంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి పండుగ సందర్భంగా వీరబ్రహ్మేంద్రస్వామి శేష వాహనంపై దక్షిణ ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు వేకువ జాము నుండే ఆలయం సింహ ద్వారం వద్ద వేచి ఉండి.. ద్వారాలు తెరవగానే భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఏకాదశి మహోత్సవాలకు ఆలయ ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను చేపట్టారు. అనంతరం గ్రామ పుర వీధుల గుండా స్వామివారి గ్రామోత్సవం చేపట్టారు.

లింకులు క్లిక్ చేస్తే... ఖాతా ఖాళీ

● కొత్త కొత్త తరహాలో సైబర్ మోసాలు

● జిల్లా వ్యాప్తంగా వెయ్యికి పైగా ఫిర్యాదులు

● రూ.22 కోట్లకు పైగా దోచుకున్న కేటుగాళ్లు



కడప(క్రైం), జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల రోజు రోజుకు మితిమీరి పోతున్నారు. ప్రజలు ఎంత జాగ్రత్తగా వున్నా కొత్త కొత్త తరహాలో సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం అందరి చేతుల్లో ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. దీంతో ప్రతి కొనుగోలు, అమ్మకాల్లో చెల్లింపు డిజిటల్ విధానంలో చేపడుతున్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, తదితర యాప్‌ల ద్వారా చెల్లిస్తున్నారు. అవన్నీ ప్రైవేట్ సంస్థలే అందువలనే మన సమాచారం అంతా వారి చేతిలో ఉన్నట్లే. ఇదే అదునుగా భావించి సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి వాటికి లింకులను పంపిస్తున్నారు. ఆ లింకులను క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. కొందరు అత్యాశ కారణంగా ఈజీ మనీ కోసం కొన్ని యాప్‌లను క్లిక్ చేస్తూ మోసపోతున్నారు.

ప్రొద్దుటూరుకు చెందిన వ్యక్తి ఫోన్‌కు లింకును పంపించారు. లింకును క్లిక్ చేయడంతో లక్షల్లో డబ్బు పోగొట్టుకున్నాడు. కడపకు చెందిన యువకుడు కూడా ఫోన్‌లో లింకును క్లిక్ చేయడంతో బ్యాంకులో ఉన్న డబ్బు కాజేశారు సైబర్ నేరగాళ్ల ఇలా జిల్లా వ్యాప్తంగా ఎందరో బాధితులుగా ఉన్నారు. మోసపోయిన వారిలో ఎక్కువగా విద్యావంతులు, ఉద్యోగులు ఉండడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా 13 నెలల్లో వెయ్యికి పైగానే ఫిర్యాదులు ఉన్నాయంటే సైబర్ నేరగాళ్ల చేతిలో ఎంతగా మోసపోతున్నారో ఇట్టే అర్థమవుతుంది. దాదాపు రూ.22కోట్లకు పైగానే డబ్బు పోగొట్టుకున్నారు.

ఆశపరులే టార్గెట్

కొందరికి డబ్బులు వస్తాయంటూ అందుకు సంబంధించి వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ లాంటివాటికి లింకులను పంపిస్తున్నారు. ఆ లింకులను క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతా ఖాళీ చేస్తున్నారు. ఆశపరులనే టార్గెట్ చేసుకుని లింకులను పంపిస్తారు. కొన్ని గేమ్స్‌కు, వర్క్ ఫ్రమ్ హోం, ఉద్యోగాలు లాంటి వాటికి సంబంధించి లింకులను పంపిస్తారు.. ఆ లింకులను క్లిక్ చేయగానే.. సైబర్ నేరగాళ్ల క్షణాల్లో బ్యాంకులోని డబ్బులను కాజేస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



సెల్ ఫోన్లకు వచ్చే లింకులకు స్పందించకూడదు. లింకులను క్లిక్ చేస్తే డబ్బును సైబర్ నేరగాళ్ల కొట్టేస్తారు. సోషియల్ మీడియాలో పోస్టులు, లింకులు పట్ల జాగ్రత్తగా ఉండాలి. సైబర్ నేరగాళ్ల కొత్త కొత్త తరహాలో మోసాలకు పాల్పడుతుంటారు. కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

-మధుమల్లేశ్వర్ రెడ్డి, సైబర్ సెల్ సీఐ

జాతీయ కాన్ఫరెన్స్‌లో వైవీయూ వీసీ


సదస్సులో వైవీయూ వీసీ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జరగనున్న ఆలిండియా యూనివర్సిటీస్ సౌత్‌జోన్ వైస్ చాన్సలర్స్ కాన్ఫరెన్స్ 2024-25లో యోగివేమన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి భాగస్వాములయ్యారు. ఉన్నత విద్య భవిష్యత్తును రూపొందించడంలో భారతదేశం పాత్ర గురించి చర్చించడానికి దక్షిణభారత విశ్వవిదాయలయాల వీసీల భేటిలో వీసీ ఉన్నత విద్యాభివృద్ధిలో తన ఆలోచనలను పంచుకోనున్నారు. వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్ అండ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.రూబన్‌కుమార్ (హయ్యర్ అకడమిక్ గ్రేడ్) ఆధ్వర్యంలో 10,11 తేదీలలో జరిగే ఈ సమావేశాల్లో భారతదేశం అభివృద్ధి చెందుతున్న భారతావనిలో డిజిటల్ అవస్థాపనను విస్తరణ, ఆవిష్కరణలకు ప్రాధాన్యతపై చర్చిస్తారు. భవిష్యత్తులో ఉన్నత విద్య పరివర్తనాత్మక పాత్రను పోషించేలా ఆలోచనలు, అకడమిక్ ఎక్సలెన్స్‌ను పెంపొందించడానికి కృషి జరుగుతుందని తెలిపారు. ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి ఒక డైనమిక్ వాతావరణాన్ని ఈ సమావేశాలు అందిస్తాయని చెప్పారు. కొత్త సాంకేతికతతో నడిచే ప్లాట్‌ఫామ్‌లు, అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యం, ఇంటర్ డిసిప్లినరీ లెర్నింగ్‌పై దృష్టిసారించడం ద్వారా ప్రపంచ విద్యాధోరణులను రూపొందించడంలో కీలక పాత్ర పోషించే రెండు రోజుల పాటు చర్చలు సాగుతాయని.. అందులో వైవీయూ వీసీ ఆలోచనలను పంచుకోనున్నారు.

బొలేరో వాహనం ఢీ.. వ్యక్తి మృతి

దువ్వూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన ధనరాజ్ (44) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం సాయంత్రం సంఘటన జరుగగా రాత్రి ఆలస్యంగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మైదుకూరు నుంచి స్కూటీపై వెళుతుండగా బొలెరోపికప్ వాహనం అతి వేగంగా వచ్చి వెనుకవైపు ఢీకొట్టినట్లు చెప్పారు. సంఘటనలో తీవ్రంగా గాయపడిన ధనరాజ్ ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో మృతిచెందినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ట్రాక్టరు ఢీకొని గొర్రెలు మృతి

కమలాపురం రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని జడ్పీ బాలుర హైస్కూలు సమీపంలో ట్రాక్టరు గొర్రెల మందపై దూసుకెళ్లడంతో ఆరు గొర్రెలు మృతి చెందాయి. శుక్రవారం రాత్రి గొర్రెల కాపర్లు రామయ్య, అయ్యప్ప మద్దిలేటిలు కమలాపురం నుంచి కుప్పారువారిపల్లెకు గొర్రెలు తోలుకుని వస్తుండగా వెనుక వైపు నుంచి ట్రాక్టర్ వేగంగా వచ్చి గొర్రెలపై దూసుకెళ్లింది. ఈ సంఘటనలో ఆరు గొర్రెలు మృతి చెందగా.. మరికొన్ని గాయపడ్డాయని తెలిపారు. వీటి విలువ రూ.1.50లక్షలు ఉంటుందని.. గొర్రెలే మా జీవనాధారమని, అధికారులు స్పందించి నష్టపరిహారం వచ్చే విధంగా చూడాలని వారు కోరుతున్నారు.

బొప్పాయి మొక్కలు పీకేశారు..

● మహిళా రైతు ఆవేదన



రైల్వేకోడూరు, జనవరి 10 (ఆంధ్ర జ్యోతి): నియోజకవర్గంలోని బీపీరాచపల్లెలో మహిళా రైతు సంగరాజు సరస్వతి ఐదెకరాల పొలంలో బొప్పాయి మొక్కలు నాటుకుంది. వీటిని కొందరు వ్యక్తులు గురువారం సాయంత్రం పెరికేశారని బాధితురాలు రైల్వేకోడూరులో శుక్రవారం మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తన పొలం నుంచి దారి కావాలని వేధింపులకు గురిచేస్తూ.. పొలంలో ఏ పంట వేసినా పీకేస్తున్నారని, కౌలుకు ఇచ్చినా దౌర్జన్యం చేస్తున్నారన్నారు. గతంలో బొప్పాయి, అరటి చెట్లు కూడా పీకేశారని.. కూలీలను కూడా పొలంలోకి రానివ్వకుండా చేస్తున్నారని తెలిపారు. సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయమని రెవెన్యూశాఖ చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

మైదుకూరు రూరల్, జనవ రి 10 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు పట్టణ పరిధిలోని నంద్యాలరోడ్డు బైపాస్ వెంకటాపురం సర్కిల్‌కు సమీపంలో ఆటో నడపుకొని జీవనం సాగిస్తున్న తుపాకుల వెంకటసుబ్బయ్య (50)ను లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆర్లగడ్డ నుంచి మైదుకూరు వైపునకు వస్తున్న లారీ ఢీకొనడంతో ఈ సంఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఇంటర్నేషనల్ ఫ్లోర్‌బాల్ క్రీడకు అజ్మతుల్లా


తల్లిదండ్రులతో అజ్మతుల్లా

కడప స్పోర్ట్స్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నగర గాంధీనగర్ పాఠశాలలో విద్యనభ్యసించే షేక్ అజ్మతుల్లా అనే విద్యార్థి ఇంటర్నేషనల్ పోటీలకు ఎంపికయ్యాడు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో గత నెల 28, 29, 30 తేదీలలో జరిగిన జాతీయస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలలో ఆంధ్రా జట్టు తరపున పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించి ఇంటర్‌నేషనల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ పోటీలు త్వరలో మలేషియాలో జరుగనున్నాయి. పేద విద్యార్థి అయిన అజ్మతుల్లా ఇప్పటికే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో వివిధ మెడల్స్ సాధించారు. అయితే అజ్మతుల్లాకు ఆ పోటీలలో పాల్గొనే ఆర్థిక స్తోమత లేక మనోవేదనతో సతమతమవుతున్నాడు. కన్న తల్లిదండ్రులు సైతం కూలి పని చేసుకుని జీవనం సాగిస్తూ అజ్మతుల్లాను చదివించుకుంటున్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో కడప జట్టు



ప్రథమ స్థానంలో నిలిచిన కడప జట్టు

ముద్దనూరు జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖకు సంబంధించి అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో కడప జట్టు ప్రథమ స్థానంలో నిలిచినట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరాజావర్మ తెలిపారు. 9,10 తేదీల్లో రెండు రోజులు ఏపీ విద్యుత్ కార్పొరేషన్ ఇంటర్ సర్కిల్ ఫుట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలు అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీల్లో కడప జట్టు ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

వేలం ద్వారా ఆదాయం రూ.19,47,000


గంగమ్మతల్లి ఆలయంలో వేలం నిర్వహిస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గంగమ్మ తల్లికి వేలం ద్వారా వచ్చిన ఆదాయం రూ.19,47,000 అని ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం గంగమ్మ దేవాలయంలో తలనీలాలు, కొబ్బరికాయలు, విడిదినాల హక్కుల కోసం వేలం నిర్వహించారు. కాగా జాతరలో తలనీలాలు (వెంట్రుకలు సేకరణ) మిగిలిన విడిదినాలకు (ప్రతిఆదివారం) సంబంధించి కొబ్బరికాయలు, పూజా సామగ్రి, షామియానా, టోల్‌గేట్ వేలం వాయిదా పడింది. ఫిబ్రవరి 28,29 తేదీల్లో జరిగే గంగమ్మ జాతరకు సంబంధించి తలనీలాలు, (వెంట్రుకలు సేకరణ), కొబ్బరికాయలు, టోల్‌గేట్, విడిదినాలు (ప్రతి ఆదివారం) హక్కులకు దేవదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఈవేలంలో టోల్‌గేట్‌కు రూ.5,70,000, కొబ్బరికాయలు రూ.6,30,000, విడిదినాలకు సంబంధించి తలనీలాలు (వెంట్రుకలు సేకరణ) రూ.5,52000 వేలం దక్కించుకున్నారు. జాతరలో తలనీలాలు (వెంట్రుకలు సేకరణ) మిగిలిన విడిదినాలకు (ప్రతి ఆదివారం) సంబంధించి కొబ్బరికాయలు, పూజా సామగ్రి, షామియానా, టోల్‌గేట్ వేలం వాయిదా పడింది. ఈ వేలం 17న నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణ అధికారి తెలిపారు. కార్యక్రమంలో సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రవీంద్రబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో ముగ్గుల పోటీలు

కడప కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈనెల 11వ తేదీ శనివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నగర రిమ్స్ సమీప శిల్పారామంలో చుక్కల ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. ఇందులో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా 5వేలు, 3వేలు, 2 వేల రూపాయల నగదు బహుమతులను అందజేస్తామన్నారు. మరో 20 మందికి కన్సోలేషన్ బహుమతులను కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరై ముగ్గుల పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

నెల్లూరు, కర్నూలు జట్ల విజయం


జాన్‌సన్ (నెల్లూరు), లలిత్‌ఇరగమ్‌రెడ్డి (చిత్తూరు), యశ్వంత్‌సూర్య (కర్నూలు)

కడప స్పోర్ట్స్, జనవరి 10, (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-12 బాలుర ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా శుక్రవారం వివిధ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లలో నెల్లూరు, కర్నూలు జట్లు విజయం సాధించాయి.

నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నెల్లూరు- చిత్తూరు జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన చిత్తూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి నిర్దీత 35 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేసింది. ఇందులో పి.లలిత్‌ఇరగమ్‌రెడ్డి 61 పరుగులు చేశాడు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 33.3 ఓవర్లలో 160 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. ఇందులో జాన్‌సన్ 55 పరుగులు చేశారు. దీంతో నెల్లూరు జట్టు 4 వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురవేసింది.

కేఓఆర్ఎం మైదానంలో అనంతపురం- కర్నూలు జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన అనంతపురం జట్టు బ్యాటింగ్‌కు దిగి 33 ఓవర్లలో 107 పరుగులకు ఆలౌట్ అయ్యింది. కర్నూలు జట్టు బౌలర్ యశ్వంత్‌సూర్య 5వికెట్లు పడగొట్టి స్వల్పస్కోర్‌కే పరిమితం చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు ఉత్కంఠ పోరులో 29 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 110 పరుగులు చేసి ఎట్టకేలకు విజయం సాధించింది.. దీంతో కర్నూలు జట్టు 1 వికెట్ తేడాతో విజయం సాధించినట్లయింది.

నారాయణే.. నమోస్తుతే..!

- భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి వేడుకలు
- ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు
- వేకువ జామునుంచే భక్తులతో కిటకిటలాడిన వైష్ణవాలయాలు
- విశేష పూజలు, అలంకారాలు, అన్నదానాలు



తంబళ్లపల్లెలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు





మదనపల్లెలో లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మదనపల్లె అర్బన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): నారాయణే.. నమోస్తుతి..! అంటూ వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని ప్రజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో వైభ వంగా జరుపుకున్నారు. మదనపల్లెలో పలు ఆలయాల్లో వేకువజామున 4 గంటలకే ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. దేవళం వీధిలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో ఆలయ ఈవో రమణ ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశికి పెద్ద ఎత్తున వస్తున్న భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు వేల సంఖ్యలో భక్తులు స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం ద్వారా దర్శించుకున్నారు. మధ్యాహ్నం స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తన అనుచరులతో టౌన్‌బ్యాంకు చైర్మన్ విద్యాసాగర్, షంషీర్, జేసీబీ వేణు, నవీన్‌చౌదరి, శివన్న, మధు కలిసి వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు, దొరస్వామినాయుడు, తదితరులు కలిసి ప్రసన్న వెంకటరమణ స్వామిని దర్శించుకున్నారు. అనపగుట్టలోని అభయ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారిని వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. గోవర్ధనగిరిలో శ్రీకృష్ణాలయంలో స్వామివారికి విశేషంగా అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయకమిటీ సభ్యులతో భక్తులకు తీర్థప్రసాదాలు అన్నదానం చేశారు. వరాల ఆంజనేయస్వామి ఆలయంలోఏ స్వామివారికి ప్రత్యేకంగా అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్తర ద్వార నుంచి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయంలో లలిత సహస్రపారాయణం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారిని ఊరేగింపు నిర్వహించారు.

గుర్రంకొండలో: మండలంలోని తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉదయాన్నే ఆలయంలో లక్ష్మీనరసింహ స్వామివారికి అర్చ న, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేసి ప్రత్యేకంగా అలంకరించి ఉత్తర ద్వార దర్శనంలో కొలువుదీర్చారు. అధిక సంఖ్యలో భక్తులు ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకుని కొబ్బరి కాయలను సమర్పించి పూజలు చేసి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణరాజు, కృష్ణప్రసాద్, అనిల్, గోకుల్, వరద, వెంకీ, ఆలయ సిబ్బంది నాగరాజు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

పీలేరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పవిత్రమైన వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం పీలేరు మండలంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. వైకుంఠ ఏకాదశి పర్వదినాన శ్రీమన్నారాయణుడిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయన్న తలంపుతో ప్రజలు వేకువజాము నుంచే ఆలయాలకు పోటెత్తారు. కోటపల్లెలోని పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వర స్వామి, వేంకటాద్రి ఇండ్ల వద్దనున్న వేంకటేశ్వర స్వామి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్దనున్న చెన్నకేశవ స్వామి, అగ్రహారంలోని అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయాలలో వైకుంఠ ద్వారం ఏర్పాటు చేసి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ధర్మకర్తలు జీవీ శ్రీనాథరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, సుగుణాకర్, ఆలయ కమిటీ సభ్యులు ముడుపులవేముల మధుసూదన్ రెడ్డి, సీఆర్ రాజేశ్, బాలం నరేంద్ర రెడ్డి, ఉమాకాంత్ రెడ్డి, శివ, కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, జీసీ మహేశ్వర రెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

తంబళ్లపల్లె, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తంబళ్లపల్లె మండలం నుంచే కాకుండా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కోసువారిపల్లె ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయం, తంబళ్లపల్లె మల్లయ్యకొండ మల్లికార్జున స్వామి ఆలయాలు కిటకిటలాడాయి. శుక్రవారం వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని క్యూ లైన్లలో బారులు తీరి ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ ప్రచార సమన్వయకర్త సీడ్ మల్లికార్జున నాయుడు, పార్టీ నాయకులు వైకుంఠ ద్వార దర్శనం ద్వారా స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద అన్నదానం చేశారు.

పెద్దతిప్పసముద్రంలో : మండలంలోని వివిధ గ్రామాల్లో వెలసిన వైష్ణవాలయాలు శుక్రవారం వైకుంఠ ఏకాదశిని పురష్కరించుకుని భక్తులతో కిటకిటలాడాయి. పీటీఎంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో వైకుంఠ ద్వారం ద్వారా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ, ఆలయ నిర్వాహకులచే ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదానంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. రంగసముద్రంలో వెలసిన చెన్నకేశవ స్వామి ఆలయం, మల్లెల గ్రామం గొందిపల్లె సమీపంలో కదిరి గుట్టపై వెలసిన కదిరి దేవుడైన నరసింహస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహించారు. పీటీఎంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని పురష్కరించుకుని ఆధ్యాత్మికవేత్త సనగరం పట్టాబిరామయ్య ఆధ్వర్యంలో వేకువ జాము నుంచే ఆలయంలో రుద్రాభిషేకం, రుద్ర హోమం నిర్వహించారు.

పెద్దమండ్యంలో: మండలంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. మండలంలోని పాపేపల్లి నరసింహాస్వామి ఆలయం, చెరువుకిందపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాలలో ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

రామసముద్రంలో: మండల కేంద్రంలో వెలసిన శ్రీకృష్ణదేవరాముల కాలంనాటి అతిపురాతన ప్రసిద్ధి చెందిన లక్ష్మీజనార్దనస్వామి ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీదేవి భూదేవి సమేతంగా లక్ష్మీజనార్దనస్వామి వారికి బెంగళూరు నుంచి తెప్పించిన పలు రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. మండల కేంద్రంలోని గౌనివారి కుటుంబీకులు స్వామివారి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిపించారు. అలాగే చెంబకూరు, మినికి గ్రామాల్లో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహించారు.

కలకడలో: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని మండల ప్రజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గోపాలపురంలోని షిర్డిసాయిబాబా ఆలయంలో కలశస్థాపన, గోపూజలను చేశారు. కలకడలోని వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామి వారు రుక్మిణి, సత్యభామ సమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. సిద్దేశ్వర ఆలయం, బాటవారిపల్లెలోని ఆంజనేయస్వామి ఆలయం, చౌడేశ్వరి ఆలయాలు, నడిమిచెర్లలోని కోదండరామస్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు.

కలికిరిలో: మండలంలోని పలు వైష్ణవాలయాల్లో శుక్రవారం వైకుంఠ ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయాలకు పోటెత్తారు. కలికిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. చెక్కరవాండ్లపల్లెలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారి దర్శనం కల్పించారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించి అన్నదానం చేశారు. గుండ్లూరు చెన్న కేశవస్వామి ఆలయంలో, గ్రామ దేవత యల్లమ్మ ఆలయంలో, పెద్దవంకపల్లె వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి ఓబులేషుని కొండలో వెలసిన ఓబులేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి కొండకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వైకుంఠ దర్శనం శనివారం కూడా కొనసాగనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు విద్యాసాగర్ స్వామి తెలిపారు. స్వామి మాలధారణ భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతి బాలినాయునిపల్లిలో వెలసిన చౌడేశ్వరీదేవి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని శుక్రవారం ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు హోమాలు నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూల మాలలతో అమ్మ వారిని అలంకరించారు. ఆలయాని వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

బి.కొత్తకోటలో: వైకుంఠ ఏకాదశిని శుక్రవారం బి.కొత్తకోట మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పట్టణంలోని బీసీకాలనీ వేంకటరమణస్వామి ఆలయం, దిగువబస్టాండులో ఉన్న చెన్నకేశవస్వామి ఆలయాలలో ఉదయాన్నే పెద్దసంఖ్యలో భక్తులు ఉత్తర ద్వార దర్శనం ద్వార వెళ్లి దైవదర్శనం చేసుకున్నారు. ఈసందర్భంగా ఆలయాలు కిటకిటలాడాయి. పట్టణంలోని సాయినాథుడి ఆలయంలో శ్రీమహావిష్ణువు అలంకరణ భక్తులను ఆకట్టుకుంది.



కలికిరిలో ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి



పెద్దమండ్యం అలంకరణలో పాపేపల్లి నరసింహస్వామి



పీలేరులో వేంకటేశ్వర స్వామిని దర్శించి పూజలు చేస్తున్న భక్తులు

పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మందబండ గ్రామంలో మినీగోకులాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

మదనపల్లె టౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బొమ్మనచెరువు పంచాయతీ మందబండలో రూ.2.30 లక్షలతో నిర్మించిన మినీగోకులాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 75 మినీ గోకులాల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.1.63 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ మొత్తం పాడి రైతులకు సబ్సిడీగా అందిస్తోందన్నారు. వీటికి తోడు పశుగ్రాసం కొరత లేకుండా రూ.1.07 కోట్లతో పశుగ్రాసం పెంపకానికి ఉపాధి హామీ పథకం కింద నిధులు విడుదల చేయనుందన్నారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ మధుబాబు, ఎంపీ డీవో తాజ్‌మస్రూర్, పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ రోహిణి, పశువైద్యాధికారులు డాక్టర్ షరన్ లారెన్స్, ప్రసాద్‌రెడ్డి, ఏపీవో సుబ్రమణ్యం, వీఆర్‌వో సౌజన్య టీడీపీ నాయకులు ముద్దుకృష్ణమనాయుడు, రఘుపతి, నందకుమార్, నరేంద్ర పాల్గొన్నారు.



మినీ గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

ములకలచెరువులో: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న మినీ గోకులాల షెడ్ల నిర్మాణాలు పాడి రైతులకు వరంలాంటిదని తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, టీడీపీ నేత మంత్రి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గూడుపల్లె పంచాయతీ కోటపల్లెలో నిర్మించిన మినీ గోకులం షెడ్డును వారు ప్రారంభించారు. ఈ షెడ్డు నిర్మానానికి ప్రభుత్వం పాడి రైతులకు రూ.రూ.2.36లక్షలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హరినారాయణ, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, కురబలకోట మండల అధ్యక్షుడు వైజీ సురేంద్రయాదవ్ పాల్గొన్నారు.

గుర్రంకొండలో: గోకులాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో వెంకటేశులు లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని ఎల్లుట్ల పంచాయితీ నల్లగుట్టపల్లెలో శుక్రవారం గోకులం షెడ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ గోకులాలు మంజూరైన లబ్ధిదారులు సకాలంలో బిల్లులు మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జగదీష్, చలమారెడ్డి, ఎల్లుట్ల మురళీ, శ్రీనివాసులు, రామయ్య, మల్లయ్య, సిద్దయ్య, రవి, కిరణ్‌లు పాల్గొన్నారు.

యానాదుల కాలనీని 'చెంచులక్ష్మి'గా మార్చాలి



ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డిని కలిసిన యానాది నాయకులు

కలికిరి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం ఆరెంవారిపల్లె గ్రామంలోని యానాదుల కాలనీని చెంచులక్ష్మి గ్రామంగా మార్చాలని పలువురు గిరిజ నాయకులు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డిని కోరారు. శుక్రవారం నగరిపల్లెలో ఎమ్మెల్యేని కలిసిన నాయకులు మాట్లాడుతూ గిరిజన యానాదుల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయించేందుకు కృషి చేయాలని కోరారు. అదే విధంగా నియోజకవర్గంలోని యానాదుల ఆవాసాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. వివిధ సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్న యానాదుల కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి లబ్ధిదారులను గుర్తించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు జానం గంగిరెడ్డి, ఉపాధ్యక్షుడు చుక్కలపాటి ఆదినారాయణ, జిల్లా నాయకులు కిల్లా విజయకుమార్, గానుగపెంట సిద్దు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంఘానికి స్థలాన్ని కేటాయించండి



తహసీల్దార్ ఖాజాబీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

మదనపల్లె టౌన్, జనవరి 10(ఆంధ్ర జ్యోతి): మదనపల్లె భవన నిర్మాణ కార్మిక సంఘ కార్యాలయానికి స్థలం కేటాయించాలని ఆ సంఘం అధ్యక్షు డు జంగాల శ్రీనివాసులు కోరారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో తహసీల్దార్ ఖాజాబీని కలసిన బిల్డిం గ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు రెడ్డిసాహెబ్, బీవీరమణ మాట్లాడుతూ 28 ఏళ్లగా తమ అసోసియేషన్ కార్యాలయం అద్దె భవనాల్లో నడుపుతున్నామని, దీని వలన ఆర్థిక భారం పెరుగుతోందన్నారు. తాము సొంత భవనం నిర్మించుకు నేందుకు ప్రభుత్వం స్థలం మంజూరు చేయాలని, స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కూడా తమకు స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారు లకు సూచించారన్నారు. ఆ మేరకు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.వెంకటేశ్, మల్‌రెడ్డి,నారాయణ, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో దుర్ఘటనను రాజకీయం చేయడం తగదు

మదనపల్లె టౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వైకుంఠద్వార దర్శనం టోకెన్ సెంటర్ వద్ద దురదృష్టవశాత్తు చోటుచేసుకున్న దుర్ఘటనను వైసీపీ నాయకులు రాజకీయం చేయడం తగదని టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉండగా అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి 35 మంది, కచ్చలూరు బోటు ప్రమాదంలో 40 మంది మృతి చెందినప్పుడు సీఎం హోదాలో జగన్ బాధితుల కుటుంబాలను పరామర్శించలేదు కానీ ఇప్పుడు తిరుపతిలో ఆరుగురు మృతి చెందితే ఆఘమేఘాల మీద వచ్చి రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ హయాంలో పనిచేసిన కొంత మంది అధికారుల వల్లే కూటమి ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయని అటువంటి వారిని తక్షణం మార్చాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శంకర, శివ, కృష్ణ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ద్వారా నిరంతర సేవాకార్యక్రమాలు



రక్తదాన శిబిరంలో పాల్గొన్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

బి.కొత్తకోట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆఫ్ హార్సిలీహిల్స్ ద్వారా జరిగే నిరంతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ క్లబ్ జిల్లాగవర్నర్ లయన్ చంద్ర హెచ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఈ సంస్థ ఆధ్వర్యంలో బి.కొత్తకోట పట్టణంలోని ఆదిత్య డిగ్రీకాలేజీలో రక్తదాన శిబిరం, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కోగర మోహన్‌రెడ్డి, కోశాధికారి సౌమ్య, మనోజ్‌కుమార్‌రెడ్డి, వెంకటరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కాలేజీ ప్రిన్సిపాల్ ప్రసాద్ పాల్గొన్నారు.

500 ఎర్రచందనం మొక్కలు పంపిణీ

మదనపల్లె, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఇంటింటా చెట్టు ఊరంతా వనం రెండోవిడత కార్యక్రమంలో భాగంగా జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు 500 ఎర్రచందనం మొక్కలు పంపిణీ చేశారు. స్థానిక బసినికొండ వెంకటేశ్వరస్వామి పాదాల చెంత శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానికులకు వాటిని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా, టీడీపీ సీనియర్ నాయకుడు ఎస్.ఎ.మస్తాన్‌లు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పిలుపు మేరకు రామాంజనేయులు..మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందని కొనియాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతోపాటు ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా నేరేడు కొండ్రాయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

తంబళ్లపల్లె, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని జుంజురపెంట పంచాయతీ బురుజుపల్లెలో నేరేడు కొండ్రాయ స్వామి ఆలయంలో ఉత్సవమూర్తి ప్రతిష్ఠ ముక్కోటి ఏకాదశి వేడుకలను గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. అర్చకులు వేణుగోపాలాచార్యులు స్వామి వారి నూతన పంచలోహ ఉత్సవమూర్తి విగ్రహానికి పంచగవ్య స్నపన పంచామృతాభిషేకం ప్రాణప్రతిష్ఠ హోమం నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ప్రచార సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు, జనసేన ఇంచార్జి పోతుల సాయినాథ్, పెద్దేరు ప్రాజెక్టు చైర్మన్ కొటాల శివకుమార్, కూటమి నేతలు పాల్గొని పూజలు చేశారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విద్యుదాఘాతంతో విద్యార్థికి తీవ్ర గాయాలు

తంబళ్లపల్లె, జనవరి 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో ధనుంజయరెడ్డి(19) అనే విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ములకలచెరువు మండలం దేవలచెరువుకు చెందిన ధనుంజయ రెడ్డి తంబళ్లపల్లె మండలం బలకవారిపల్లెలో ఉన్న తాత ఇంట్లో ఉంటూ ఐటీఐ చదువుకుంటున్నాడు. శుక్రవారం సాయంత్రం తాత సత్తిరెడ్డితో కలసి పేలవారిపెంట నుంచి బలకవారిపల్లెకు ట్రాక్టర్‌లో వరిగడ్డి తరలించడానికి వెళ్లాడు. ఈ క్రమంలో మార్గమధ్యలోనివరిగడ్డిని తరలిస్తుండగా విద్యుత్ వైర్లు ట్రాక్టరుకు తగులకుండా పైకెత్తే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా అయ్యి ధనుంజయరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు బాధితుడిని హుటాహుటిన మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యులు వైద్య చికిత్సలు అందించడంతో కోలుకుంటున్నాడు.

కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కుటుంబకలహాలతో యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కురబలకోట మండలంలో చోటుచేసుకుంది. ముదివేడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు తిరుపతికి చెందిన అబ్దుల్లా (47) తన భార్య లలితతో గొడవపడి తంబళ్లపల్లె నియోజకవర్గం, కురబలకోట మండలం, సింగనోడ్డిపల్లెలోని తన తమ్ముడి ఇంటికి గురువారం రాత్రి వచ్చి తన బాధను తమ్ముడితో చెప్పుకున్నాడు. శుక్రవారం ఉదయాన్నే పురుగులమందుతాగి అపస్మారక స్థితిలో పడిఉన్న అబ్దుల్లాను చికిత్స కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఇక్కడి ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రూయాకు రెఫర్ చేశారు. ముదివేడు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతు బజార్ వద్ద మందుల దుకాణం ఏర్పాటుకు చర్చలు

మదనపల్లె టౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని రైతుబజార్ వద్ద ప్రైవేటు మందుల దుకాణం ఏర్పాటుకు చర్చలు జరుపుతున్నట్లు మార్కెటింగ్‌శాఖ ఏడీఎం త్యాగరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక రైతుబజార్ వద్ద ప్రైవేటు మెడికల్‌షాపు నిర్వాహకులు ఏడీఎం త్యాగరాజును కలసి, అక్కడ దుకాణం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఏడీఎం మాట్లాడుతూ ఈ విషయాన్ని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, ప్రజలకు, రైతులకు ఉపయోగపడేలా ఉంటే అనుమతిపై పరిశీలిస్తామన్నారు.


మిట్స్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

కురబలకోట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను శుక్రవారం వైభవంగా జరుపుకున్నారు. కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగవల్లులు, గాలిపటాలు ఎగరవేయడం, హరికథదాసులు, భోగి మంటలు గ్రామీణ సంప్రదాయనృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి మాట్లాడుతూ ప్రజలంతా సుఖశాంతులతో మెలగాలని కోరారు. అనంతరం వివిధ రకాల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ద్వారకనాథ్, ప్రిన్సిపాల్ యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువులో: మండలంలోని వేపూరికోట ఎస్వీ పాఠశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు, ఉట్టి ఉత్సవం, గాలి పటాలు ఎగరేయడం నిర్వహించి బహుమతులు అందజేశారు. అలాగే బోగి మంటలు వేశారు. తెలుగు సంస్కృతి సాంప్రదాయాలకు అనుగుణంగా రంగోలి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బీఎన్ గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్‌లో: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను కళాశాల ప్రిన్సిపాల్ గోవతి బాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే కళాశాల్లో బోగిమంటలు వేసి విద్యార్థులు రంగవల్లులు వేయగా కళాశాలలో సంక్రాంతి శోభ నెలకొంది. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాలు వితరణ



మదనపల్లె అర్బన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సహృదయ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం మదనపల్లెలో పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధాత్రి ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ స్వాతి మాట్లాడుతూ పేదలకు సహృదయ సంస్థవారు సరుకులు పంపిణీ చేయడం ఆనందం గా ఉందన్నారు. కార్యక్రమంలో తాలుకా ఎస్ఐ హరిహ రప్రసాద్ నిత్యావ సరాలు అందించారు. సభ్యులు, పేదలు పాల్గొన్నారు.

సంఘమిత్రల చేతివాటంపై చర్యలు తీసుకోండి

గుర్రంకొండ, జనవరి 10(ఆంధ్రజ్యోతి):మండల మహిళా సమాఖ్యలో పని చేస్తున్న సంఘమిత్రల అవినీతిపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సరస్వతి ఏపీఎం రజనీకుమారిని కోరారు. గుర్రంకొండ మండల సర్వసభ్యసమావేశం ఎంపీపీ సీతమ్మ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. అనంతరం ఎంపీడీవో వెంకటేశులు మాట్లాడుతూ ఎంపీడీవో కార్యాలయం, అన్ని సచివాలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు. . కార్యక్రమంలో నాయకులు, కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కోరంలేక మండల సమావేశం వాయిదా

కలకడ, జనవరి 10(ఆంధ్రజ్యోతి):మండల సర్వసభ్య సమావేశానికి తగిన సంఖ్యలో సభ్యులు హాజరుకాకపోవడంతో శుక్రవారం వాయిదా పడింది. మండలంలో 11 మంది ఎంపీటీసీలకుగానూ వైసీపీకి 8 మంది, టీడీపీకి 3 సభ్యులున్నారు. అయితే వారిలో గుడిబండ ఎంపీటీసీ సభ్యులురాలు మాత్రమే హాజరయ్యారు. దీంతో సమావేశం నిర్వహించడానికి కావాల్సిన కోరం లేక వాయిదాపడి నట్లు ఎంపీడీవో అబ్దుల్ రహీం ప్రకటించారు. గత ఏడాది అక్టోబరులో జరిగిన సమావేశం కూడా కోరం లేక వాయిదాపడింది. తహశీల్దార్ ఫణికుమార్, సర్పంచులు రాజగోపాల్‌రెడ్డి, రమణ పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ఇద్దరు విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులు భవ్యశ్రీ, సంధ్యలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నిమ్మనపల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి):మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతిలో గల మోడల్‌స్కూల్ విద్యార్థినులు ఇద్దరు షూటింగ్ బాల్‌లో జాతీయ స్థాయికి ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ మూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆదర్శపాఠశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం ఎంపీసీ చదువుతున్న భవ్యశ్రీ, సంధ్యలు గత నెల అనంతపురంలో జరిగిన షూటింగ్ బాల్ పోటీలో జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు. ఒరిస్సాలోని పూరిలో ఈ నెల 17, 18. 19తేదీల్లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. విద్యార్థినులను అధ్యాపక బృందం అభినందించింది.

విద్యార్జన పైనే వివేకానందుడి బోధనలు



వివేకానందుడి బోధనలపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

కలికిరి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తగినంత విద్యార్జన చేయాలనే లక్ష్యంతో స్వామి వివేకానందుడు తన బోధనలు కొనసాగించారని స్థానిక ప్రభుత్వ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అంజలీదేవి చెప్పారు. స్థానిక కళాశాలలో శుక్రవారం వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సమాజానికి మెరుగైన జీవన ప్రమాణ కోసం విద్యార్జన తప్పనిసరిగా వివేకానందుడు ప్రచారం చేశారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఫేస్ పెయింటింగ్, రంగోలి, పరుగు పందాల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. మొదట వివేకానందుడి స్ఫూర్తిదాయక బోధనల గురించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.గులాబ్‌జాన్, అధ్యాపకులు స్వర్ణలత, కె.మాధవి, ఉదయ, లిఖిత, జి.మాధవి, హాజీరా, శైలజ, కీర్తి, అనూష పాల్గొన్నారు.

తల్లికివందనం వెంటనే అమలు చేయాలి



సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

మదనపల్లె టౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం తల్లికివందనం పథకం ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ ఎదుట ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులతో కలసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో వున్న రూ.3,850 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా విద్యారంగాన్ని పట్టించుకోలేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో ప్రైవేటు విద్యాసంస్థల యజమానులు విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నారన్నారు. మదనపల్లెలోని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను యూనివర్సిటీని చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టరేట్ డీఏవో రాఘవేంద్రకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వినోద్, వినయ్, గంగారాణి, భవిత, సుప్రియ, కమలాకర్, సాయికిరణ్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.